


# దుర్గమ్మకు గణనాధుని పట్టువస్త్రాల బహూకరణ

కాణిపాకం,సెప్టెంబర్ 26 ప్రభాతవార్త: విజయవాడ ఇంద్రకీలాద్రి శ్రీదుర్గా మల్లేశ్వర స్వామివారి దేవస్థానంలో జరుగుతున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం తరపున శుక్రవారం పట్టువస్త్రాలను సమర్పించారు. ప్రతిఏటా దసరా శరన్నవ రాత్రి ఉత్సవాల సందర్భంగా కాణిపాకం దేవస్థానం తరపున స్వామివారికి పట్టువస్త్రాలను సమర్పించడం ఆనవాయితీ. ఈమేరకు కాణిపాకం ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్ పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్‌తో కలసి శుక్రవారం విజయవాడ చేరుకుని అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించారు. పట్టువస్త్రాలను సమర్పించేందుకు విజయవాడ దుర్గ మల్లేశ్వరి దేవస్థానంకు చేరుకున్న వీరికి ఆలయ ఈఓ శీనా నాయక్, అర్చకులు ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం వీరు మంగళ వాయిద్యాల నడుమ నూతన పట్టువస్త్రాలను ఊరేగింపుగా తీసుకు వెళ్ళి ఆలయంలో అందజేశారు. వీటిని అమ్మవారికి అలంకరించి ప్రత్యేకపూజలు నిర్వహి ంచారు. అనంతరం దుర్గగుడి ఆలయ అధికారులు పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీ మోహన్, ఆలయ ఈఓ పెంచల కిషోర్ తదితరులను ఆలయ మర్యాదలతో ఘనంగా సత్కరించి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను, చిత్రపటాలను అందజేశారు. ఈకార్యక్రమంలో కాణిపాకం ఆలయ నూతన ఛైర్మన్ మణినాయుడు, దుర్గగుడి ఆలయ నూతన ఛైర్మన్ బుర్ర రాధాకృష్ణ గాంధీ, కాణిపాకం దుర్గగుడి ఆలయాల అధికారులు, అర్చకులు, వేదపండితులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



పట్టు వస్త్రాలను సమర్పించేందుకు దుర్గగుడి వద్ద ఊరేగింపుగా తీసుకెళుతున్న పూతలపట్టు ఎమ్మెల్యే, ఈఓలు, అర్చకులు

# శ్రీచెంగాళమ్మకు మహాలక్ష్మి అలంకారం



మహాలక్ష్మి అలంకారంలో చెంగాళమ్మ

సూళ్లూరుపేట, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త: సూళ్లూరుపేటలోని శ్రీచెంగాళమాత పరమేశ్వరిదేవి దేవస్థానంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రులలో భాగంగా శుక్రవారం అమ్మణ్ణి శ్రీమహాలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చింది. అలంకారానికి నాయుడుపేటకు చెందిన ఓడూరు మునికృష్ణారెడ్డి, పావని దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. దేవస్థానం ప్రాంగణంలోని యాగ మండపంలో వేదపండితుల మంత్రోచ్ఛ్చణల నడుమ నిర్వహించిన చండీ యాగానికి యర్రం హనుమారెడ్డి, హిమబిందు దంపతులు ఉభయకర్తలుగా ఉన్నారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా సూళ్లూరుపేటకు చెందిన కవిత బృందంచే కూచిపూడి నృత్య ప్రదర్శన, నాయుడుపేటకు చెందిన మౌనిక బృందంచే భరతనాట్య ప్రదర్శనలు అలరించాయి. అమ్మవారికి ప్రతినిత్యం సమర్పించే సారెలో భాగంగా గాండ్లవీధి, బాపూజీవీధి, కచ్చేరివీధి, పార్కువీధి, శ్రీవెంకటేశ్వర వీధుల నుంచి అంగరంగ వైభవంగా మేళతాళాలతో, బాణాసంచా వేడుకలతో అమ్మణ్ణికి భక్తిపూర్వకంగా సారె సమర్పించారు. చెంగాళమ్మ ఆలయ ట్రస్టుబోర్డు మాజీ సభ్యులు మాదరపాక జగన్మోహన్ అమ్మణ్ణి వేషధారణతో సారెలు తెచ్చే భక్త బృందంతో కలిసి ప్రదర్శనలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. శ్రీనాగేశ్వరస్వామి దేవస్థానంలో పార్వతి అమ్మవారు బాలాత్రిపురసుందరిదేవి అలంకారంలో భక్తులకు దర్శన మిచ్చారు. పాలెం రాధాకృష్ణారెడ్డి, హంసవేణమ్మ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. నాగేశ్వరస్వామి దేవస్థానంలో జరుగుతున్న శరన్నవరాత్రుల వేడుకలకు మాజీ ఎంఎల్‌సీ వాకాటి నారాయణరెడ్డి విచ్చేసి అమ్మణ్ణిని, శివపార్వతులను దర్శించుకున్నారు. శ్రీచెంగాళమ్మ దేవస్థానంలో సహాయ కమిషనర్ బి.ప్రసన్నలక్ష్మి, నాగేశ్వరస్వామి దేవస్థానంలో ఆలయ ఛైర్మన్ తాటిపర్తి ఆదినారాయణరెడ్డి పర్యవేక్షణలో ఈ కార్యక్రమాలు జరిగాయి.

# జిఎస్టీ 2.0 ప్రయోజనాలపై... అవగాహన




జిఎస్టీ 2.0 అమలు పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

చిత్తూరు, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త: జిఎస్టీ 2.0 ప్రయోజనాలపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. కలెక్టరేట్ నుండి కలెక్టర్ సుమిత్‌కుమార్ శుక్రవారం జిల్లా అధికారులు, మున్సిపల్ కమీషనర్లు, తహసిల్దార్లు, ఎంపిడిఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన వస్తు సేవలపన్ను తగ్గింపు జిఎస్టీ 2.0 ప్రయోజనాలపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించడానికి నెల రోజుల పాటు ప్రత్యేక ప్రచార అవగాహన కార్యక్రమంను విజయవంతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. జిఎస్టీ తగ్గింపు వల్ల ఏ విధంగా లబ్ది కలుగుతుందనే విషయంపై ప్రజలకు విస్తృతంగా తెలియజేయాలన్నారు. ఈ మేరకు అక్టోబర్ 19వ తేదీ వరకు ఈ కార్యక్రమంను పక్కాగా క్షేత్ర స్థాయిలో నిర్వహించాలన్నారు. అలాగే ఈ నెల 26 నుండి 29వ తేదీ వరకు ఇంటింటికి జిఎస్టీ ఫలాలు పేరిట ప్రచార కార్యక్రమంలో భాగంగా సామాన్య ప్రజలకు గృహ, నిత్యవసర వస్తువులు, ఆహారం, మందులు, విద్య, స్టేషనరీ, బట్టలు, క్రీడావస్తువులు తదితరాల జిఎస్టీ తగ్గింపు వల్ల కలిగే లబ్దిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. దీపావళి పర్వదినం ముందురోజైన అక్టోబర్ 19వ తేదీ నెల రోజుల ముగింపు కార్యక్రమంను రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున నిర్వహించడానికి ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ సూపర్ జిఎస్టీ అమలుపై పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వాణిజ్య పరిశ్రమల శాఖ జాయింట్ కమీషనర్ రఘునాథ్‌రెడ్డి, డిప్యుటీ కమీషనర్ పరదేశినాయుడు తదితరులు పాల్గొన్నారు.

**డిజిటల్ నర్స్ సెంటర్ల ద్వారా నాణ్యమైన వైద్య సేవలు : కలెక్టర్**

జిల్లాలో నర్స్ సెంటర్ల ద్వారా ప్రజలందరికీ నాణ్యమైన వైద్య సేవలు అందించడానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ వైద్యాధికారులను ఆదేశించారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ద్వారా కొత్తగా టాటా కన్సల్టెన్సీ సంస్థ ఏర్పాటు చేస్తున్న డిజిటల్ నర్స్ సెంటర్లపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ చిత్తూరు, నగరి, పూతలపట్టు, పలమనేరు, పుంగనూరు నియోజకవర్గాల్లో త్వరలో అందుబాటు లోకి రానున్న డిజిటల్ నర్స్ సెంటర్లతో జిల్లాలోని ప్రజలందరికీ నాణ్యమైన వైద్య ఆరోగ్య సేవలు ఉచితంగా అందుబాటులోకి రానున్నాయన్నారు. దీని ద్వారా దీర్ఘకాలిక వ్యాధులు, ఇతర వ్యాధులు, రక్తపోటు, మధుమేహం, క్యాన్సర్లు, గర్భశయ క్యాన్సర్లు, నోటి క్యాన్సర్, స్థన క్యాన్సర్, గుండె వ్యాధులు, థైరాయిడ్, మూత్రపిండాలు, న్యూరాలజీ, అర్థోపెడిక్‌లకు శస్త్ర చికిత్సలు, ఫాలో అప్ చికిత్స,టెలి కాన్సల్టెషన్ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు కాల్ చేసిన వెంటనే చికిత్సలు నిర్వహిస్తారన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నియోజకవర్గాల వారీగా అధికారులతో సమీక్షించి ఈ కార్యక్రమానికి అవసరమైన సిబ్బంది,వనరులు,మౌళిక వసతులు, కార్యాచరణ ప్రణాళిక తయారు చేస్తామన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుధారాణి, ప్రోగ్రాం అధికారులు, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# ఇక ఖరారు కాని... శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి

శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 26 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి నియామకానికి సంబంధి ంచిన ఉత్కంఠతకు తెరపడింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత శ్రీకాళహస్తీశ్వరాలయం ధర్మకర్తల మండలి తెలుగుదేశం పార్టీకే దక్కుతుందని ఆశావహులకు పదవులు వస్తాయని ఎందరో ఆశించారు. అయితే కూటమి ప్రభుత్వం కాబట్టి వివిధ సమీకరణలతో దేవస్థానం ఛైర్మెన్ పదవిని జనసేన పార్టీకి చెందిన నాయకుడు కొట్టే సాయిని వరించింది. దాంతో తెలుగుదేశం వర్గాలు తీవ్ర నిరాశకు గురయ్యారు.సుమారు ఒకటిన్నర సంవత్సరంగా తెలుగుదేశం నాయకుడు రంగినేని చెంచయ్యనాయుడుకే ఛైర్మెన్ పగ్గాలని ఊరించారు. కానీ వివిధ సమీకరణలతో జనసేనకు ఛైర్మెన్‌గిరి లభించగా సభ్యుల్లో కూడా ఇతర నియోజకవర్గాల వారికి కూడా అవకాశం కల్పించినట్లు తెలిసింది. ఇందులో తిరుపతి నియోజకవర్గంలో ముగ్గురికి అవకాశం లభించగా సత్యవేడు నియోజకవర్గం నుంచి కూడా ఒకరికి పదవి అవకాశం లభించింది.

**అందరికి అవకాశం:**

విజయవాడ కనకదుర్గమ్మ ఆలయ కమిటిలో 16మంది సభ్యులను నియమించారు. ఈ సమీకరణలను పరిగణలోకి తీసుకుంటే శ్రీకాళహస్తీశ్వరాలయానికి కూడా 16 మంది సభ్యులను నియమించనున్నారు. అక్కడి సమీకరణలను పరిగణలోకి తీసుకుంటే తెలుగుదేశం పార్టీకి 11 మందికి అవకాశం కల్పించారు. బిజెపికి రెండు, జనసేనకు మూడు స్థానాలు నిష్పత్తిలో నియమించారు. కమిటిలో 8మంది మహిళలకు అంటే 50శాతం నియమించారు. కనకదుర్గమ్మ ఆలయ కమిటిలో తెలంగాణాకు కూడా ఒక సభ్యుని అవకాశం కల్పించారు.ఇదే సమీకరణలతో శ్రీకాళహస్తీశ్వరుని ధర్మకర్తల మండలి నియామకం ఉండవచ్చునని పరిశీలకులు భావిస్తున్నారు.

# సంయమనంతో, సేవాభావంతో భక్తులకు సేవలు

**- తిరుమలకు వచ్చే భక్తులు విలువైన వస్తువులు జాగ్రత్త -తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు**

తిరుమల,సెప్టెంబర్ 26ప్రభాతవార్తప్రతినిధి: కలియుగవైకుంఠం తిరుమలలో శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో ఐదవరోజు (రేపురాత్రి)గరుడసేవకు తరలివచ్చే అశేషసంఖ్య భక్తులకు పోలీసు అధికారులు, సిబ్బంది, శ్రీవారి సేవకులు ఒర్పు, అంకితభావంతో సేవలందించాలని తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు సూచించారు. ఇప్పటివరకు జరిగిన సేవలు ఒక ఎత్తయితే ఆదివారం రేపు జరిగే గరుడవాహనసేవ మరో ప్రత్యేకత అన్నారు. భక్తులకు సేవలందించామనే విషయంలో బ్రహ్మోత్సవం మొత్తం గరుడసేవపైనే ఆధారపడుతుందన్నారు. బ్రహ్మోత్సవ సమావేశం మందిరంలో గరుడసేవ ఏర్పాట్లు, భక్తులు పెరిగితే అందించాల్సిన సేవలు, విధులు నిర్వహిస్తున్న అధికారులు భక్తులతో మెలగాల్సిన తీరుశుక్రవారం సాయంత్రం మీడియతో మాట్లాడారు. గరుడసేవలో ప్రతి భక్తునికి అన్నప్రసాదాలు, తాగునీరు అందించేలా చూడాలన్నారు. తిరుమల మొత్తం సిసి కెమరాల పర్యవేక్షణలో ఉంటుందన్నారు. చిన్న పిల్లలు తప్పిపోకుండా జియోట్యాగ్ సిస్టం వేస్తున్నామన్నారు. తిరుమలకు వచ్చే భక్తులు విలువైన వస్తువులు జాగ్రత్తగా భద్రపరుచుకోవాలన్నారు. భక్తులు స్వామివారి గరుడసేవను దర్శించుకుని తిరిగి వారివారి గమ్యస్థానాలకు చేరుకోవాలని ఎస్పీ ఆకాంక్షించారు. సమస్య లేకుండా భక్తులకుసేవలందించినపుడే అందరూ ఆనందపడతారన్నారు.

గ్యాలరీల్లో ఉన్న భక్తులకు ఉదయం నుంచి నిరంతరాయంగా ఆదివారం అర్థరాత్రి వరకు భక్తుల సేవలో పోలీసులు ఉంటారన్నారు. తిరుమలలో 12వేల వాహనాలు మించితే అలిపిరిలో నిలిపివేసి పార్కింగ్ ప్రదేశాలకు పంపుతామన్నారు. గ్యాలరీల్లో ప్రవేశ నిష్క్రమణ మార్గాలు చక్కగా ఉంటాయన్నారు. భక్తులకు సంతృప్తికరంగా సేవలందించేలా పోలీస్ విభాగం సిద్ధమైందన్నారు. వాహనమండపం వద్ద భక్తులకు, ప్రముఖులకు దర్శనం కల్పించడంపై ఎస్పీ పరిశీలించారు. బ్రహ్మోత్సవాల్లో గరుడసేవ జరగనుండటంతో తిరుమలకు పెద్దసంఖ్యలో భక్తులు చేరుకుంటారని టిటిడి అంచనావేస్తోంది. ఈ కారణంగా నేటి రాత్రి 8గంటల నుండి సోమవారం ఉదయం 6గంటల వరకు తిరుమల- తిరుపతి, తిరుపతి-తిరుమల ఘాట్‌రోడ్లపై ద్విచక్రవాహనాలను పూర్తిగా నిషేధించారు. స్థానికులేగాక ఇతర ప్రాంతాలనుండి భక్తులు ద్విచక్రవాహనాలను తిరుపతిలోనే పార్కింగ్‌చేసేలా చూడాలని ఆయన కోరారు.

**-నేటి రాత్రి నుండి ఘాట్‌లో ద్విచక్ర వాహనాలు బంద్**




గరుడసేవ ఉత్సవం ఏర్పాట్ల సమావేశం మాట్లాడుతున్న ఎస్పీ

# ముత్యమై భక్తకోటిని... మురిపించిన మలయప్ప





**తిరుమల,సెప్టెంబర్ 26 ప్రభాతవార్తప్రతినిధి:** చల్లని తెల్లటి ముత్యాలను వాహనంగా చేసుకుని మలయప్ప స్వామి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో శుక్రవారం రాత్రి విశేష అలంకారంలో ఊరేగి భక్తులను కటాక్షించారు. వాహన మండపంవద్ద ముత్యపు పందిరిపై వేంచేపు చేసిన దేవదేవునికి అర్చకులు వేదఘోష్టితో కర్పూర హారతులిచ్చారు. అనంతరం స్వామి వారి వాహనం బయలుదేరి ఆలయ నాలుగు మాఢ వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ముత్యాలు విలువైనవి. చల్లదనాన్ని ప్రసాదిస్తాయి. తెల్లనికాంతు లీనుతుం టాయి. అలాంటి వాహనాన్ని తనకు సేవలందించేలా చేసుకున్న భగవంతుడి దర్శనంతో భక్తులు ముగ్దులయ్యారు. ఏడు కొండలవాడా గోవిందా అంటూ భక్తులు నామస్మరణలు చేశారు. పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, టిటిడి ఈఓ అనిల్ కుమార్ సింఘాల్ దంపతులు,బోర్డు సభ్యులు భానుప్రకాశ్‌రెడ్డి, దివాకర్‌రెడ్డి, నరేశ్, శాంతారాం, ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం, సిపిఆర్ఓ డాక్టర్ తలారి రవి, అర్చకులు, వేదపండితులు పాల్గొన్నారు.

# విజయవాడ సంఘటనలో ఎవరికి మూడిందో?

**-దుర్గమ్మ ఆలయంలో దర్శనాల లొల్లి- శ్రీకాళహస్తి నుంచి అంత మంది ఉద్యోగులు ఎందుకు వెళ్ళారు!**

శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 26 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయానికి సంబంధించి విజయవాడ కనక దుర్గమ్మ ఆలయానికి సారె సమర్పించటానికి బుధవారం ఆలయం నుంచి వెళ్ళారు. అయితే అక్కడకు వెళ్ళిన కొందరు అమ్మవారి దర్శనానికి లొల్లి చేసారు. అక్కడ సిబ్బందిపై గొడవకు పాల్పడినట్లు సమాచారం. సారెతో పాటు దేవాదాయశాఖ కమిషనర్ 13 మందికి అనుమతించింది. అయితే శ్రీకాళహస్తి నుంచి సుమారు 70మంది వెళ్ళినట్లు సమాచారం, వెళ్ళినవారు ఆలయంలో అమ్మవారి దర్శనానికి వెళ్ళి సిబ్బందిలో గొడవ పడినట్లు సమాచారం. ఈ అంశం దేవాదాయశాఖ కమిషనర్‌కు తెలిసింది. దాంతో ఆరోజు అక్కడ ఏం జరిగిందనే విషయంగా కమిషనర్ సిసి కెమెరాల్లో పరిశీలించారు. దాంతో తాము అనుమతించింది 13మంది అయితే ఇంత మంది ఎందుకు వెళ్ళారంటూ కమిషనర్ సీరియస్ అయినట్లు సమాచారం. దాంతో నిబంధనలకు వ్యతిరేకంగా వెళ్ళటమే కాకుండా ఉద్యోగులై ఉండి బాధ్యతలు విస్మరించినందుకు మండిపడ్డట్లు తెలిసింది, రభస చేసిన ఉద్యోగులు అధికారికంగా వచ్చారా, లేదా? అనధికారికంగా వచ్చి గొడవలకు దిగారా? అని కమిషనర్ ప్రశ్నించినట్లు సమాచారం. ఆ రోజు స్థానిక శాసనసభ్యుడు, ఆలయ ఇఓ దంపతులు వేదపండితులు హాజరయ్యారు. అయితే 70 మంది ఎలా వెళ్ళారు? అనేది చర్చనీయాంశంగా మారింది. శ్రీకాళహస్తీశ్వరాలయం నుంచి నిబంధనలకు వ్యతిరేకంగా దుర్గమ్మ గుడికి వెళ్ళి అక్కడ రభస సృష్టించిన వారిపై చర్యలు తీసుకోమని ఆదేశించినట్లు సమాచారం.ప్రస్తుతం ఇఓ విజయవాడ ఉత్సవ్‌లో ప్రోటోకాల్ ఆఫీసర్‌గా ఉన్నారు. ఆయన వచ్చిన తరువాత ఎవరి మీద సస్పెండ్ వేటు పడుతుందో అనే ఉత్కంఠత చోటు చేసుకుంది.

## గోవింద మాల భక్తులకు... భారీగా అన్నదానం



పుత్తూరు(నగరి), సెప్టెంబరు 26 ప్రభాతవార్త : స్థానిక ఓం శక్తి ఆలయం వద్ద తమిళనాడు ఓచ్చేరి నుంచి విచ్చేసిన సుమారు 750 మంది గోవింద భక్తులకు పట్టణ పరిధిలోని పలువురు దాతలు శుక్రవారం అన్నదానం చేశారు. భక్తులతో ఓం శక్తి ఆలయం కిటకిటలాడింది. భక్తులు చేసిన భజనలు మిన్నంటాయి. అనంతరం ఆలయంలో గోవింద భక్తులతో పాటు పాదచారులకు కూడా అన్నదానం చేశారు. గత 18 సంవత్సరాలుగా భక్తులు ఈ విధంగా భారీ స్థాయిలో అన్నదానం చేస్తున్నట్టు దాతలు తెలిపారు. అన్నదాన కార్యక్రమానికి ఆలయ నిర్వాహకులకు అందిస్తున్న సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో దాతలు ఆర్ముగం, పెరుమాళ్, సుబ్రమణ్యం, జయచంద్రారెడ్డి, గోపాల్‌రెడ్డి, రమేష్, కుమార్, దయానిధి, చంద్రారెడ్డి, మునికృష్ణారెడ్డి, ఎల్లప్పరెడ్డి, వేలు, రామ్మోహన్, కృపానిధి, అశోక్, రామ్మూర్తి, పొన్నురంగం, దేవ, మురళీమోహన్, కాశి, జగన్, హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# తరలి పోతున్న ఎర్ర బంగారం

**అక్రమార్కులకు అండగా రెవెన్యూ అధికారులు!**

నాయుడుపేట, సెప్టంబరు 26 ప్రభాతవార్త: సూళ్ళూరుపేట నియోజకవర్గంలో ఉన్న ప్రకృతి సంపదను కాపాడాల్సిన అధికారులే చట్టవ్యతిరేక పనులు చేస్తున్న అక్రమార్కులకు అండగా నిలుస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. నియోజకవర్గం లోని ఆయా మండలంలో ఉన్న విలువైన ప్రకృతి సంపద యథేచ్ఛగా ఎల్లలు దాటుతున్న సంబంధిత రెవెన్యూ, పోలీస్,మైనింగ్ అధికారులు తమ జేబులు నింపుకోవడమే ధ్యేయంగా పనిచేస్తున్నారన్నారు. ఈక్రమంలో దొరవారిసత్రం మండలంలోని పూలతోట మిట్టలో ప్రభుత్వం పేదలకు ఇచ్చిన అసైన్,సీజెఎఫ్ఎస్ భూముల్లో కొంతమంది అక్రమార్కులు గతకొంత కాలంనుండి రాత్రి సమయంలో భారీ యంత్రాలతో గ్రావెల్ మాఫియా చేస్తు కోట్లరూపాయలు దోచుకుంటున్నారని వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం ఇసుక,గ్రావెల్ మాఫియాను అరికట్టాలన్న ధృఢసంకల్పంతో పనిచేస్తుంటే నియోజకవర్గంలో అధికారుల పర్యవేక్షణ లోపం నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వ ఆశయాలకు తూట్లు పడుతున్నాయన్నారు. పూలతోటమిట్ట నుండి భారీయంత్రాలతో గ్రావెల్‌ను తరలించడం వల్ల ఆనేపూడి-దొరవారిసత్రం మధ్యలో రోడ్డుపై పెద్దపెద్ద గుంతలు ఏర్పడి అధ్వానంగా మారడంతో, ద్విచక్ర వాహనాలు, ఆటోలు,కార్లు ప్రయాణం చేయాలంటే అవస్థలు పడుతున్నామని వాహన చోదకులు ఆరోపిస్తున్నారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ,పోలీస్ అధికారులు అక్రమార్కులకు అండగా వుంటూ, కోట్లు విలువచేసే ప్రకృతి సంపదైన ఎర్రబంగారం ఇతర రాష్ట్రాలకు తరలివెళుతుదన్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతధికారులు స్పందించి గ్రావెల్ మాఫియాకు అడ్డుకట్ట వేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.





జెసీబీలతో త్రోవ్వుతున్న దృశ్యం - రోడ్లు దుస్థితి

# ప్రభావం చూపని... జిఎస్టి తగ్గింపు!

**-నష్టపోతున్న వినియోగదారుడు, -భారీగా లాభపడుతున్న అమ్మక దారుడు**

**టీవీలు, స్కూటర్లు, కార్ల కథ దేవుడేరుగు...కనీసం పాలు, పెరుగు, మజ్జి, నీళ్ళు రేట్లు కూడా తగ్గలేదు**




రేణిగుంట సెప్టెంబర్ 26 ప్రభాతవార్త: కేంద్ర ప్రభుత్వం సామాన్య ప్రజలకు నిత్యవసర వస్తువులు, మందులు, పాల ఉత్పత్తులు, ఎలక్ట్రానిక్ వస్తువులు, ఆటోమొబైల్ పరికరాలు, వాహనాలు, అందుబాటులోకి తేవాలని ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జీఎస్టీ తగ్గింపు ప్రభావం పెద్దగా చూపడం లేదు. వ్యాపారులు తగ్గిన జిఎస్టి అనుగుణంగా వస్తువులను విక్రయించడం లేదని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. పాల ఉత్పత్తులపై వ్యాపారులు ఒక్క పైసా కూడా తగ్గించడం లేదు. గతంలో ఉన్న ధరల ప్రకారమే పాలను పాల ఉత్పత్తులను జీఎస్టీ తగ్గించిన వస్తువులను విక్రయించడం లేదు. మా వద్ద పాత ఉత్పత్తిలే ఉన్నాయి కొత్త ఉత్పత్తులు ఇంతవరకు రాలేదు అవి వచ్చిన తర్వాత ప్యాకెట్ల పై ఉన్న ఎంఆర్పి ధరలను బట్టి ఉత్పత్తులను విక్రయిస్తామని వ్యాపారస్తులు బాహాటంగా చెబుతున్నారు. ప్రభుత్వాలు సెప్టెంబర్ 22వ తేదీ నుండి తగ్గిన జిఎస్టి అమల్లోకి వచ్చిందని ప్రకటించినప్పటికీ ఆచరణలో శూన్యం. కొన్ని పేరుగాంచిన మెడికల్ షాపుల్లో మినహాయించి అన్ని మెడికల్ షాపుల్లో ధరలు మామూలుగానే ఉన్నాయి. ఉన్నతాధికారుల నుండి ఎలాంటి ఆదేశాలు రాలేదంటూ వ్యాపారస్తులు సమాధానాలు దాటేస్తున్నారు. ధరలు పెరిగిన వెంటనే వ్యాపారస్తులు ధరల ప్రింటింగ్‌పై అప్పటికప్పుడు పెరిగిన ధరల స్టిక్కర్లు అంటించి అమ్మడం పరిపాటి. అయితే జీఎస్టీ తగ్గిన తర్వాత తగ్గిన ధరలకు అనుకూలంగా ఉత్పత్తులను ఎందుకు అమ్మడం లేదన్నది మిలియన్ డాలర్ల ప్ర? ప్రభుత్వాలు ప్రజల సంక్షేమం కోసం ఎన్ని సంక్షేమాలు చేపట్టినప్పటికీ అధికారుల పర్యవేక్షణ లోపం వల్ల సంక్షేమ ఫలాలు ప్రజలకు అందడం లేదనడంతో ఎలాంటి అతిశయోక్తి లేదు. ఇప్పటికైనా జిఎస్టి అధికారులు స్థానిక అధికారులతో కలిసి ఆకస్మిక దాడులు నిర్వహించకపోతే వ్యాపారులు చేసే మోసాల వల్ల సామాన్య ప్రజల్లో ప్రభుత్వాలపై నమ్మకం సన్నగిల్లుతుంది. ఎవరైనా విషయం తెలిసిన వినియోగదారుడు వస్తువులపై కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించిందని వ్యాపారస్తులను అడిగితే జీఎస్టీ తగ్గింపు తాము అమ్మే ప్రాజెక్టులపై తగ్గలేదంటూ చెప్పడం కోసం మెరుపు. మీకు తెలుసో తెలియదో తగ్గించింది ఎలక్ట్రానిక్ వస్తువులపై ఎలక్ట్రికల్ వస్తువులపై కాదంటూ కొంతమంది మార్వాడీలు కస్టమర్ల వద్ద రాగాలు తీస్తున్నారు. సామాన్య ప్రజలు మాత్రం జీఎస్టీ తగ్గింపు ప్రభుత్వాలు ప్రజలపై విసిరిన మాయాజాలంగా భావిస్తున్నారు

## అర్హులైన పేదలకు పిఎంఎవై 2.0పథకంలో లబ్ది : డిఇఇ



**కుప్పం, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త :** అర్హులైన నిరుపేదలకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 పథకంలో లబ్ది కలిగించడం జరుగుతుందని హౌసింగ్ డిఇఇ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావుతో కలసి అంగీకార్ కార్యక్రమం కరపత్రాలు ఆవిష్కరించారు. అర్హులైన వారికి బ్యాంకు రుణాలు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే పిఎం సూర్యఘర్ పథకంలో ప్రభుత్వం రాయితీతో సోలార్ రూఫ్‌టాప్‌లను అందిస్తోందన్నారు. కార్యక్రమంలో మెప్మా ఐబి శ్రీరాములు, సిఎంఎం మనోహర్‌రెడ్డి, సిఎల్‌డిటి రేవతి, ఎఇ అభిషేక్, రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

## తుమ్మిశిచెరువుకు కృష్ణాజలాలు అందించాలి : కలెక్టర్



**శాంతిపురం, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త :** మండలంలోని తుమ్మిశి పెద్ద చెరువుకు మూడు రోజుల్లో హంద్రీ-నీవా కాలువల ద్వారా కృష్ణాజలాలు అందించాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. తుమ్మిశి చెరువుకు నీరు రావడం లేదని సమీప గ్రామస్తులు టిడిపి మండల అధ్యక్షుడు ఉదయ్‌కుమార్‌కు తెలియజేయడంతో ఆయన నేతలు ఆంజనేయరెడ్డి, నాగరాజు, చంద్రశేఖర్, సర్పంచ్ బాలకృష్ణతో కలసి సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన జిల్లా కలెక్టర్ నేరుగా హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ కాలువ వద్దకు చేరుకుని అధికారులను రప్పించి మాట్లాడారు.కార్యక్రమంలో కడ పి.డి. వికాస్ మర్మత్, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

## ఇంటికో పారిశ్రామికవేత్త రావాలనేది సిఎం ఆశయం : కడ పి.డి.



**రామకుప్పం, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త:** ఇంటికో పారిశ్రామికవేత్త తయారు కావాలనేది సిఎం చంద్రబాబునాయుడు ఆశయమని కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ పేర్కొన్నారు. శుక్రవారం మండల కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి కుటుంబాన్ని బంగారు కుటుంబంగా మార్చేందుకు సిఎం చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారన్నారు. ఐఎఎస్ అధికారి భానుమూర్తి అధ్వర్యంలో పి4 అంశాలు తెలుసుకుని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఓ మురళీధర్‌రెడ్డి, ఎంపిపి సులోచన గుర్రప్ప, మండల టిడిపి అధ్యక్షుడు వెంకటరమణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఇరవై లక్షలతో భూగర్భ డ్రైనేజ్



**రామకుప్పం, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త :** స్థానిక తిమ్మసముద్రం కాలనీలో ఇరవై లక్షల నిధులతో భూగర్భ డ్రైనేజ్ నిర్మాణ పనులను కూటమి నేతలు ప్రారంభించారు. కాలనీలో ఇటీవల వర్షాలకు నీరు ఇళ్లలో చేరడంతో నేతలు విషయాన్ని ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్‌కు వివరించారు. దీంతో ఆయన భూగర్భ డ్రైన్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. టిడిపి మండల అధ్యక్షుడు వెంకటరమణ, ఆంజనేయరెడ్డి, ఎంపిపి సులోచన గుర్రప్ప, నేతలువిజయ్‌రెడ్డి,అల్లిశీన, బాలరాజు, మురళి, సుబ్బన్న, పద్మమ్మ, ఆంజనేయప్ప, సురేష్ పాల్గొన్నారు.

## నేడు సదుముకు సజ్జల రామకృష్ణారెడ్డి రాక

**సదుం. సెప్టెంబర్ 26 ప్రభాతవార్త :** సదుం మండలం ఎర్రాతివారి పల్లెలో జరిగే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పుంగనూరు నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశానికి రాష్ట్ర వైకాపా కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి హాజరవుతారని మండల వైసీపీ కన్వీనర్ రెడ్డి తెలిపారు. దాంతోపాటు రాష్ట్ర పార్టీలోని ముఖ్య నాయకులు చిత్తూరు అన్నమయ్య, తిరుపతి జిల్లాల నియోజకవర్గ సమన్వయ నాయకులు, ఎమ్మెల్యేలు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పెద్దిరెడ్డి ద్వారకనాథ్ రెడ్డి భూమన కరుణాకర్‌రెడ్డిలతోపాటు అందరూ హాజరవుతారని చెప్పారు.

## పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత : హేమావతి



**చిత్తూరురూరల్, సెప్టెంబరు 26 ప్రభాతవార్త:** చుట్టుప్రక్కల పరిసరాలు శుభ్రంగా వుంటేనే ప్రతి ఒక్కరు మంచి ఆరోగ్యంగా వుంటారని, పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని 32వ డివిజన్ టిడిపి అధ్యక్షురాలు హేమావతి పేర్కొన్నారు. స్వచ్చతాహి సేవ 2025లో భాగంగా గురు, శుక్రవారం చిత్తూరులోని నగరపాలకసంస్థ పరిధిలోని 32వ డివిజను నందు ఏక్ దిన్ ఏక్ గంట ఏక్ సాత్ స్వచ్చత కార్యక్రమంను చేపట్టామని, చిత్తూరుశాసనసభ్యులు గురజాల జగన్మోహన్ ఆదేశాలతో తెలుగుదేశం పార్టీ నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నరేష్, పచ్చపులతో కలసి అన్ని ప్రాంతాలను శుభ్రంగా వుంచడం జరిగిందనీ, పారిశుధ్య కార్మికులు వేకువజాము నుంచే పనిచేస్తున్నారనీ, 50శాతం చెత్త మన ద్వారానే ఉత్పత్తి అవుతోందని, ప్రజలు బాధ్యతగా వ్యర్థాలు రోడ్లపై పడేయకుండా అవగాహనతో వ్యవహరిస్తే కార్మికులపై పనిభారం తగ్గించడమే కాకుండా నగరం పరిశుభ్రంగా వుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు అడ్మిన్ కార్యదర్శి యోగేశ్వర్, సచివాలయ సిబ్బంది దేవేంద్ర, నాయకులు మురళి, శ్రీనివాసులు, రమాదేవి, వీణ, యమున తదితరులు పాల్గొన్నారు.

## మోహిని దేవి అలంకారంలో శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు

**కల్లూరు, సెప్టెంబర్ 26, ప్రభాతవార్త** పులిచెర్ల మండలం కల్లూరు శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో దేవి శరవణ రాత్రి ఉత్సవాలలో భాగంగా శుక్రవారం అమ్మవారు మోహిని దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో ఉదయం అమ్మవారికి అభిషేకం నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం అర్చనలు పూజలు జరిపి నైవేద్యం సమర్పించి మహా మంగళహారతి గావించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

## పరిసరాల పరిశుభ్రత తోనే అంటువ్యాధులు దూరం

**కల్లూరు, సెప్టెంబర్ 26, ప్రభాతవార్త** పరిసరాల పరిశుభ్రతతోనే అంటువ్యాధులు దూరం అవుతాయని పీలేరు సబ్ యూనిట్ అధికారి విద్యాసాగర్ అన్నారు. పులిచెర్ల మండలం కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని మూడు చెరువులు, నివాసాల పరిసరాల ప్రాంతాలలో ఆయిల్ బాల్స్ వేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి ప్రవీణ్ కుమార్ వర్షాకాలంలో సోకే వ్యాధులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది కృష్ణయ్య, ఏఎన్ఎంలు షబానా, సరస్వతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి పై బాలకృష్ణ అనుచిత వ్యాఖ్యలు తగవు- అమరనాథ్ రెడ్డి

**రొంపిచెర్ల, సెప్టెంబర్ 26, ప్రభాతవార్త:** అసెంబ్లీలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పై అసెంబ్లీ సాక్షిగా బాలకృష్ణ దుర్భాషలాడటం యావత్ ఆంధ్రప్రదేశ్‌కి సిగ్గుచేటని వైఎస్ఆర్సీపీ రాష్ట్ర ప్రచార విభాగం ప్రధాన కార్యదర్శి అమరనాథ్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలపై విద్వేషాలు ఉన్నంత మాత్రాన తన స్థాయి మరిచి బాలకృష్ణ హుందాగా వ్యవహరించకుండా ఇలా చౌకబారు వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. అసెంబ్లీ సమావేశంలో ప్రతి ఒక్కరూ హుందాగా వ్యవహరించాలి కానీ సభలో లేని వ్యక్తి గురించి ఇలా మాట్లాడటం తగదన్నారు. ఇప్పటికైనా బాలకృష్ణ తన తప్పు తెలుసుకొని తన వ్యాఖ్యలు వెనక్కి తీసుకొని, క్షమాపణ చెబితే మంచిదన్నారు. అదే విధంగా సమాజం తలదించుకునే విధంగా మాట్లాడిన బాషను కూడా శాసనసభలో స్పీకర్ రికార్డుల నుండి తొలగించాలని, రాజకీయాలలో విమర్శలు అనేవి హుందాగా ఉండాలి కానీ ఇలా అసభ్యకరంగా ఉండకూడదని బాలకృష్ణ పై మండిపడ్డారు.

**- *గతం మరిచావ బాలకృష్ణ*..** బాలకృష్ణ గుర్తు పెట్టుకావాలని గతంలో తమరి ఇంట్లో కాల్పులు జరిగితే ఎటువంటి కేసులు లేకుండా నిన్ను రక్షించింది ఎవరో తెలుసా దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి అని అన్నారు. కాని ఈ విషయాన్ని వైయస్ఆర్ రాజకీయాల్లో ఎక్కడ వాడుకోలేదని, టీడీపీ నాయకులు గుర్తు పెట్టుకోవాలని సూచించారు. అలాగే 2014 నుంచి 2019 వరకు బసవ తారక హాస్పిటల్‌కి సంబంధించిన ఆరోగ్యశ్రీ బిల్లులు నిలిచిపోతే, బసవ తారక హాస్పిటల్‌కి రావాల్సిన ఆరోగ్యశ్రీ బిల్లులని ఇచ్చిన ఘనత వైఎస్ జగన్మోహన్ రెడ్డి దే అన్నారు. అలాగే అఖండ మూవీకి కావాల్సిన షోల గురించి మంత్రులకు మీరు అడిగితే బాలకృష్ణకి ఏం కావాలో చేయండి అని చెప్పిన గొప్ప మనసున్న వ్యక్తి వైయస్ జగన్ మోహన్ రెడ్డి అని గుర్తు చేశారు. ఇవన్నీ కూడా బాలకృష్ణ గుర్తు పెట్టుకొని ప్రవర్తిస్తే చాలా మంచిదని, కొంచమైనా సంస్కారం ఉంటే వైఎస్ జగన్మోహన్ రెడ్డికి వెంటనే క్షమాపణ చెప్పాలని బాలకృష్ణ పై మండిపడ్డారు.

## గర్భవతులు పౌష్టికాహారం తీసుకోవాలి రొంపిచెర్ల,

సెప్టెంబర్ 26, ప్రభాతవార్త

గర్భవతులు పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్వైజర్ శిరీష తెలిపారు. శుక్రవారం రొంపిచెర్ల గ్రామ పంచాయతీలోని ముత్యాలమ్మ గుడి అంగన్వాడీ కేంద్రంలో 8వ రాష్ట్రీయ పోషకాహార దినోత్సవంను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భవతులు పౌష్టికాహారం తీసుకోవడం వలన ఆరోగ్యమైన శిశువును జన్మనిస్తారని అన్నారు. బిడ్డ పుట్టిన వెంటనే తల్లి ముర్రుపాలు పట్టించాలని కోరారు. తల్లిపాలు బిడ్డకు శ్రీరామరక్ష అని అన్నారు. తల్లిపాలు శిశువుకు పట్టించడం వలన శిశువులో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. అలాగే తల్లిపాల ప్రాముఖ్యత గురించి, పౌష్టికాహారం గురించి, స్థూల కాయం గురించి వివరించారు. గర్భవతిగా ఉన్నప్పుడు పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవడం వలన శిశువును జన్మనిచ్చిన తరువాత కూడా ఆరోగ్యంగా ఉంటారన్నారు. అనంతరం పౌష్టికాహార స్టాల్స్‌ను ఏర్పాటు చేసి వాటి ప్రాముఖ్యతను, తయారీ విధానాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో



## ఆసుపత్రిని తనిఖీ చేసిన డిసిహెచ్‌సి

**పూతలపట్టు, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త:** మండల పరిధిలో ఉన్న పి కొత్తకోట సిహెచ్‌సి ప్రభుత్వాసుపత్రి శుక్రవారం డిసిహెచ్‌సి చిత్తూరు డాక్టర్ కె.పద్మాంజలి దేవి ఆకస్మిక తనిఖీ చేశారు. ఆమె రోగులతో మాట్లాడుతూ హాస్పటల్ సిబ్బంది మీకు ఎలా స్పందిస్తున్నారూ అని రోగుల్ని అడిగి తెలుసుకున్నారు. గర్భనీలకు నెలకు ఒకసారి స్కానింగ్‌లు చేస్తున్నారా లేదా వారికి మందులు అందుతున్నాయా లేదా అత్యవసర సమయంలో వస్తున్న రోగులకి నాణ్యమైన వైద్యం అందించాలని స్టాఫ్‌కి చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వెంకటేశ్వరరావు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళల కోసమే స్వస్థ నారీ సశక్త పరివార్ అభియాన్

- జిల్లా బిజెపి సీనియర్ నాయకులు చిట్టిబాబు కొల్లా



**చిత్తూరుహెల్త్, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త:** ప్రధాని నరేంద్రమోడి జన్మదినం పురస్కరించుకుని సెప్టెంబర్ 17వ తేదీ నుండి అక్టోబర్ 2వ తేదీ వరకు మహిళల ఆరోగ్య సంరక్షణ కోసం స్వస్థ నారీ సశక్త పరివార్ అభియాన్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగిందని జిల్లా బిజెపి సీనియర్ నాయకుడు చిట్టిబాబు కొల్లా పేర్కొన్నారు. గుడిపాల మండల కేంద్రంలో శుక్రవారం పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సంధ్యారాణి ఆధ్వర్యంలో నిర్వహించిన ఆరోగ్య శిబిరంలో జిల్లా బిజెపి సీనియర్ నాయకులు చిట్టిబాబు కొల్లాతో పాటు జిజెఎం ట్రస్ట్ వ్యవస్థాపకులు గురజాల చెన్నకేశవులునాయుడు, మండల టిడిపి అధ్యక్షులు సుబ్రమణ్యం నాయుడు, సర్పంచ్ రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు సోమనాథ్‌గౌడ్, చంద్రన్ చల్లా, మెడికల్ ఆఫీసర్లు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలు

- చిత్తూరులో రన్ ఫర్ టూరిజం 2కె రన్ కార్యక్రమం

**చిత్తూరు, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త:** ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలను జిల్లా కేంద్రం చిత్తూరులో శనివారం ఘనంగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. చిత్తూరు గాంధీ విగ్రహం నుండి మెసానికల్ గ్రౌండ్స్ వరకు రన్ ఫర్ టూరిజం 2కె రన్ కార్యక్రమంను ఉదయం 7 గంటలకు ప్రారంభించడం జరుగుతుందన్నారు. మున్సిపల్, పోలీసు, క్రీడా, విద్యాశాఖ అధికారులకు బాధ్యతలు కేటాయించడం జరిగిందన్నారు.

## ఎస్పీని కలిసిన సిఆర్ రాజన్



**చిత్తూరు, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త:** జిల్లా ఎస్పీగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన తుషార్ డూడిని శుక్రవారం జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సిఆర్ రాజన్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఎస్పీ తుషార్ డూడిని ఆయన కార్యాలయంలో జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సిఆర్ రాజన్‌తో పాటు మాజీ ఎమ్మెల్సీ బిఎన్ రాజసింహులు, మాజీ ఎమ్మెల్సీ ఎఎస్ మనోహర్, చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, మొదలియార్ కార్పొరేషన్ ఛైర్మన్ సిఎంటి త్యాగరాజులు, చిత్తూరు జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్, పెనుమూరు మార్కెట్ కమిటీ ఛైర్మన్ కృష్ణమనాయుడు, ఆనయకులు రాజశేఖర్, త్రిమూర్తి, సురేష్, బాబునాయుడు, సురేంద్రనాయుడు తదితరులు వున్నారు.

## యామదరి తహసిల్దారు టార్గెట్

- అధికార పార్టీ నాయకులు భూఆక్రమణలకు వత్తాసు అని ఆరోపణలు



**చిత్తూరుహెల్త్, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త:** యాదమరి మండల తహసిల్దారు పార్థసారధి మండల పరిధిలో అధికార పార్టీ నాయకులు పాల్పడుతున్న భూఆక్రమణలకు వత్తాసు పలుకుతున్నారని రసూల్ నగర్ ఎఏడబ్ల్యుకు చెందిన బుజ్జి ధ్వజమెత్తారు. చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ తమ అనుభవంలో వున్న 2 ఎకరాల విస్తీర్ణం భూమిని మండల తెలుగుదేశం పార్టీ నాయకుల మద్దతుతో ఇతరులు ఆక్రమించుకుంటున్నారని ఆరోపించారు. తహసిల్దారు అండతో అక్రమార్కులు తప్పుడు రికార్డులను సృష్టించి తమను వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై జిల్లా అధికారులు విచారంచి తగు న్యాయం చేయాలని ఆమె విన్నవించారు.

## శ్రీలలిత త్రిపుర సుందరీదేవిగా మరగదాంబిగా అమ్మవారు



**కాణిపాకం, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీమరగదాంబిగా సమేత మణికంఠేశ్వరాలయంలో జరుగుతున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఐదవరోజు శుక్రవారం మరగదాంబిగా అమ్మవారు శ్రీలలిత త్రిపుర సుందరీ దేవి అలంకారంతో భక్తులకు దర్శనమిచ్చారు. ఈసందర్భంగా శ్రీమణికంఠేశ్వరాలయంలో ఆలయ ప్రధాన అర్చకులు సోమశేఖర్ గురుకుల్ ఆధ్వర్యంలో అర్చక స్వాములు వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ స్వామి, అమ్మవార్ల మూలవిరాట్‌లకు ఉదయం ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి దూపదీప నైవేద్యాలను సమర్పించారు. ఈకార్యక్రమంలో ఆలయ అధికారులు, ఆలయ అర్చకులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

## చిరువ్యాపారులు ఆత్మగౌరవంతో బ్రతకాలి : కమీషనర్



**కుప్పం, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త:** చిరు వ్యాపారులు ఆత్మగౌరవంతో బ్రతకాలని మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు పేర్కొన్నారు.స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మెప్మా అధ్వర్యంలో లోక్ కళ్యాణ్ మేళా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా కుప్పంలోని 212మంది చిరువ్యాపారులకు ఐడి కార్డులు, సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ లోక్ కళ్యాణ్ మేళా పథకంలో చిరు వ్యాపారులకు ఎలాంటి ష్యూరిటీ లేకుండా బ్యాంకులు రుణాలు మంజూరు చేస్తాయన్నారు. సమావేశంలో మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్, ఎఎంసి ఛైర్మన్ జిఎం రాజు, హౌసింగ్ డిఇఇ వినోద్ కుమార్, కౌన్సిలర్లు జిమ్‌దాము, జాకీర్, వేలు, చిరువ్యాపారుల సంఘం అధ్యక్షుడు మంజు క్లస్టర్ ఇన్‌చార్జ్ కన్నన్, రాష్ట్ర నేత గోపీనాథ్, మాజీ ఎఎంసి ఛైర్మన్ సత్యేంద్రశేఖర్, రెస్కో డైరెక్టర్ శివ,కార్పోరేషన్ డైరెక్టర్ వేణుగోపాల్, జనసేన కోఆర్డినేటర్ నరేష్, సిఎంఎం మనోహర్‌రెడ్డి, సిఒ శోభ తదితరులు పాల్గొన్నారు.

## కొత్తగా స్వాగత ఆర్చ్ నిర్మాణం



**కుప్పం, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త :** నియోజకవర్గ కేంద్రమైన కుప్పం పట్టణంలో ప్రవేశించే ప్రాంతం అయిన కుప్పం ఏరియా ఆస్పత్రి సర్కిల్ వద్ద స్వాగత ఆర్చ్ నిర్మాణంకు శుక్రవారం కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్, మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్, కమీషనర్ శ్రీనివాసరావు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈసందర్భంగా పి.డి. మాట్లాడుతూ కుప్పం పట్టణాన్ని సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో మోడల్ టౌన్‌గా మలచనున్నట్లు తెలిపారు. కౌన్సిలర్లు జిమ్‌దాము, జాకీర్, సోమశేఖర్, సురేష్, క్లస్టర్ ఇన్‌చార్జ్ కన్నన్, కో ఇన్‌చార్జ్‌లు తిరుమగళ్, శ్యాంసుందర్, రాష్ట్ర నేత గోపీనాథ్, కడ సభ్యుడు సతీష్, రెస్కో డైరెక్టర్లు ఆర్ముగం, శివ, కార్పోరేషన్ డైరెక్టర్ వేణుగోపాల్, సర్దార్, గిరి, టిసి వెంకటప్ప, జయరాంనాయుడు పాల్గొన్నారు.

## జనసేన నుంచి హరికృష్ణను తొలగింపు!




**కుప్పం, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త:** జనసేన పార్టీనుంచి శాంతిపురం మండలం కడపల్లికి చెందిన హరికృష్ణను తొలగిస్తూ అతని ఐడి కార్డు, సభ్యత్వాన్ని రద్దు చేస్తున్నట్లు కుప్పం జనసేన ఇన్‌చార్జ్ నరేష్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. తమిళనాడులో వంద కిలోల గంజాయి తరలిస్తూ హరికృష్ణ తమిళనాడు పోలీసులకు మరో ఇద్దరు వ్యక్తులతో పట్టుబడిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో ఆయనను పార్టీ నుంచి తొలగిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రెస్కో డైరెక్టర్ అమీర్, గంగమ్మగుడి డైరెక్టర్ పవన్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీల పురోగతిపై శిక్షణ కార్యక్రమం



**సదుం, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త :** గ్రామ పంచాయతీల పురోగతి సూచికపై సదుం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో రాధా రాణి ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఇందులో పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్ల కు శిక్షణ చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామ పంచాయతీలలో ఉన్న రెవెన్యూ రిసోర్సెస్‌పై సిబ్బందికి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో మండల స్థాయి సిబ్బంది పాల్గొన్నారు

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## ధాన్యం, దానం రూపమే శ్రీ ధనలక్ష్మి అవతారం



**పుంగనూరు, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త:**

రైతులు పండించే ధాన్యంలోనూ, మానవులు చేసే దానంలోనూ, ప్రజలు అనుసరించే ధర్మంలో నిండి ఉంటుందని శ్రీ చౌడేశ్వరి దేవి ఆలయ ప్రధాన అర్చకులు తెలియజేశారు. శ్రీ సప్తమాతృక సమేత శ్రీ చౌడేశ్వరి దేవికి శుక్రవారం శ్రీ ధనలక్ష్మి అలంకరణ నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు వేణుగోపాల్ రెడ్డి, ఉషశ్రీ దంపతుల ఆధ్వర్యంలో ఈ సందర్భంగా అష్టలక్ష్మి దేవతల ప్రసన్నం కోసం హోమాన్ని నిర్వహించారు. సమాజమంతా సుఖసంతోషాలతో ఉండాలని కోరుతూ యజ్ఞ యాగాలు నిర్వహించామని ట్రస్ట్ కార్యదర్శి శివకుమార్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం కావడంతో అమ్మవారిని దర్శించుకోవడానికి వందలాదిగా మహిళలు తరలివచ్చారు. కార్యక్రమాలలో చౌడేశ్వరి దేవి ట్రస్ట్ సభ్యులు మరియు చదల్ల గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## పోతుగుంటను కలిసిన జిఆర్ విజయశంకర్



***పుంగనూరు సెప్టెంబర్ 26 ప్రభాతవార్త :*** శ్రీశైల భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవస్థానం చైర్మన్‌గా ఎన్నికైన పోతుగుంట రమేష్ నాయుడును ఏబీవీపీ రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యుడు జీఆర్ విజయశంకర్ కలిసి అభినందనలు తెలియజేశారు. ఇదే సందర్భంగా మాజీ మంత్రి, జమ్మలమడుగు శాసనసభ్యులు ఆదినారాయణ రెడ్డిని,బీజేపీ దళిత మోర్చ రాష్ట్ర అధ్యక్షుడు పనతల సురేష్, సిద్ధార్థ విద్యాసంస్థల అధినేత అశోక్‌రాజు ని మర్యాదపూర్వకంగా కలిశారు. పులి రెడ్డి నరేంద్ర కుమార్‌రెడ్డి, ఓసూరి కిరణ్ కుమార్, శివా రాయల్ తదితరులతో ఇంద్రకీలాద్రిపై వెలసిన కనకదుర్గ,మల్లేశ్వర స్వామిని దర్శించుకున్నారు.

## శ్రీ ధనలక్ష్మిని దర్శించుకున్న ఎస్‌కే



**పుంగనూరు,సెప్టెంబర్ 26 ప్రభాతవార్త** విజయదశమి ఉత్సవాల సందర్భంగా బోయకొండ గంగమ్మ ఆలయ కమిటీ మాజీ చైర్మన్, ప్రముఖ బిల్డర్ ఎస్.కె రమణారెడ్డి శుక్రవారం ఉదయం చదల్ల లో శ్రీ ధనలక్ష్మి అవతారంలోని శ్రీ చౌడేశ్వరి దేవి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపకులు డాక్టర్ ఎన్ గోపాల్ రెడ్డి రమణారెడ్డికి శాలు కప్పి సన్మానం చేసి, మెమెంటో అందజేశారు. నియోజకవర్గంలోనే అత్యంత వైభవంగా విజయదశమి ఉత్సవాలు వేణుగోపాల్ రెడ్డి నిర్వహిస్తున్నారని అభినందించారు.

## మహాభాగ్య ప్రదాయకం ధనలక్ష్మీ నమోస్తుభ్యం!



**బోయకొండ(చౌడేపల్లి), సెప్టెంబర్ 26 ప్రభాతవార్త:** ధన, ధాన్య, శ్రీలక్ష్మీ నమోస్తుతే అంటూ భక్తులు అమ్మ వారికి ముడుపులు చెల్లించుకొన్నారు. ప్రముఖ శక్తిక్షేత్రం బోయకొండ గంగమ్మ ఆలయంలో జరుగుతున్న దసరా శరవన్నరాత్రి ఉత్సవాల్లో భాగంగా 4వ రోజైన శుక్రవారం అమ్మలనుగన్న గంగమ్మ సకల సంపదలు సమకూర్చే ధనలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చింది. ఉదయాన్నే వేదపండితులు, అర్చకులచే గంగమ్మకు విశేషాభిషేకం, ధనలక్ష్మీదేవి అలంకరణగా వించారు. ప్రాంగణంలో వేదపండితుడు గోవర్ధనశర్మ ఆధ్వర్యంలో వివిధ హోమాలు, అమ్మవారి సంకల్పం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. బెంగళూరుకు చెందిన బసవరాజ్, హేమ, కృష్ణప్ప, శకుంతల, బసవరాజు, వేద, తిరుపతి వేణుగోపాల్‌రెడ్డి, సుగుణ, మదనపల్లి ధనలక్ష్మీ(డిపిఓ), శివప్రసాద్, చౌడేపల్లి అంజన్‌కుమార్, సుశీల, పుంగనూరు లబురామ్, గీతాదేవి, రామిరెడ్డి, ప్రగతి, పులిచర్ల మురళీమోహన్‌రెడ్డి, కలికిరి శ్రీనివాసులు, శ్రీలక్ష్మీ, ముళబాగల్ హనుమప్ప, విద్యావతిలు ఉభయదారులుగా వ్యవహరించారు. ఆలయ ఇఓ ఉప కమీషనర్ ఏకాంబరం, అధికార, సిబ్బంది సేవలందించారు.

## గంగమ్మ సేవలో ప్రముఖులు



**బోయకొండ(చౌడేపల్లి), సెప్టెంబర్ 26 ప్రభాతవార్త:** శక్తిస్వరూపిణీ బోయకొండ గంగమ్మను పలువురు ప్రముఖులు దర్శించుకొన్నారు. దసరా మహోత్సవాల్లో భాగంగా అమ్మవారు ధనలక్ష్మీదేవిగా కొలువు తీరారు. బోయకొండ దేవస్థానం మాజీ ఛైర్మన్ ఎస్.కె.వెంకట్రమణారెడ్డి, జిల్లా పంచాయతీ అధికారిణి ధనలక్ష్మీలు అమ్మవారిని దర్శించుకొన్నారు. ఇఓ, ఉపకమీషనర్ ఏకాంబరం వారిద్దరినీ దుశ్శాలవాలతో సత్కరించారు. కూటమి ప్రభుత్వంలో బోయకొండ మరింత అభివృద్ధి చెందుతుని ఎస్కెఆర్ అన్నారు. ఆలయ అధికార సిబ్బంది, తేదేపా నాయకులు మనోహర్, ఏటవాకిలి సోమశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## 28న ర్యాలీని జయప్రదం చేయండి

**చౌడేపల్లి, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త:** ఈనెల 28న మదనపల్లిలో జరిగే రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీని విజయవంతం చేయాలని మాలమహానాడు మండలాధ్యక్షుడు కొత్తపల్లి మణి పిలుపునిచ్చారు. రాజ్యాంగం రక్షణ కోసం జరిగే ర్యాలీలో పాల్గొనాలన్నారు. కృపామణి, రాజేంద్ర, ముకుందా, సుబ్రమణ్యం, సురేష్, విజయ్, అశోక్, డివిడ్‌లు హాజరయ్యారు.

## పలమనేరులో ప్రత్యేక మహిళా వైద్యశిబిరం

**పలమనేరు, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త:** మున్సిపాల్టీ పరిధిలోని కాకాతోపులో శుక్రవారం స్వస్థనారీ స్వశక్తి పరివార్ అభయాన్ పేరుతో ప్రత్యేక మహిళా వైద్యశిబిరం నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ డా.సురేఖ ఆధ్వర్యంలో స్పెషలిస్ట్ వైద్యులచే హెల్త్ చెకప్ నిర్వహించారు. మున్సిపల్ కమీషనర్ ఎస్వీ రమణారెడ్డి, ఏరియా ఆసుపత్రి సూపరిండెంట్ మమతారాణి, వైద్యులు యుగంధర్, దేవరాజులు, ఏరియా ఆసుపత్రి చైర్మన్ నాగరాజు, కౌన్సిలర్లు కిరణ్, ఖాజా, సబ్ యూనిట్ అధికారి జయశంకర్, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## దసరా సెలవుల్లోనూ పాఠశాల తరగతులు!



**పలమనేరు టౌన్, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త:** దసరా సెలవుల్లోనూ పలమనేరు, గంగవరం మండలాల్లోని ప్రైవేటు పాఠశాలల్లో తరగతులు నిర్వహిస్తున్నారని ఆరోపిస్తూ ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఎంఇఓ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ దసరా సెలవుల్లోనూ తరగతులు నిర్వహిస్తుంటే విద్యాశాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. జిల్లాఉపాధ్యక్షుడుసంజయ్,పలమనేరు నియోజకవర్గం కార్యదర్శి రిషి, నాయకులు అమాంశ్ పాల్గొన్నారు.

## బాస్ ఆధ్వర్యంలో అన్నదానం



**పలమనేరు, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త:** పలమనేరు బలిజసేవా సంఘం (బాస్) ఆధ్వర్యంలో శుక్రవారం మధ్యాహ్నం స్థానిక ఎంబిటి రోడ్డులోని శ్రీకృష్ణదేవ రాయల విగ్రహం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. బాస్ నాయకుడు స్వర్గీయ టివి చలపతి ప్రథమ వర్థంతి సందర్భంగా సంఘం నాయకులు, ఆయన కుటుంబ సభ్యులు శ్రీకృష్ణ దేవరాయల విగ్రహానికి పూల మాలలు వేసి నివాళలర్పించారు. బాస్ ఐక్యత వర్థిల్లాలని, టివి చలపతి ఆత్మకు శాంతి చేకూరాలని నినాదాలు చేశారు. మాజీ డిసిసి అధ్యక్షుడు సుధాకర్, నాయకులు రూపేష్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వారాహి అమ్మవారికి పంచమి పూజలు



**పాలసముద్రం, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త:** పాలసముద్రం మండలం పాలసముద్రం గ్రామంలో వెలసిన వారాహి అమ్మవారికి శుక్రవారం పంచమి కావడంతో విశేష అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. ఈ పూజ కార్యక్రమంలో చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు అందుకున్నారు. నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగాఅమ్మవారికివిశేష పూజలు నిర్వహించి హోమగుండం వెలిగించారు.

## శ్రీ.శ్రీ.శ్రీ ఎల్లమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



**కల్లూరు, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త:** పులిచెర్లలో శ్రీశ్రీశ్రీ ఎల్లమ్మ తల్లి ఆలయంలో రాహుకాల అభిషేక కార్యక్రమం స్వామి శ్రీనివాస దీక్షితులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ పూజ, అభిషేక కార్యక్రమంలో రాయల్ మోహన్, మురళీమోహన్ రెడ్డి, కుమార్ రెడ్డి, శ్యామ్ రెడ్డి, నాగయ్య దొర రాజా, దొర రూపేష్, రమణారెడ్డి రాంకుమార్ రెడ్డి, మహేశ్వర్ రెడ్డి తదితరులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఓన్‌సోర్స్ రెవెన్యూపై శిక్షణ తరగతులు

**గుడుపల్లె, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త:** స్థానిక మండల కార్యాలయంలో సర్పంచులు, కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లకు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు ఓన్‌సోర్స్ రెవెన్యూపై రెండు రోజుల శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈసందర్భంగా అధికారులు మాట్లాడుతూ పంచాయతీలకు ఆదాయ మార్గాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో టిడిపి మండల అధ్యక్షుడు సుబ్బు, మాజీ అధ్యక్షుడు బాబునాయుడు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## భక్తుని చేతిలో బ్యాగ్‌ను తస్కరించిన వ్యక్తి



శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 26 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయంలో దొంగల దాడులు తగ్గటం లేదు. శుక్రవారం ఓ భక్తుడు స్వామి అమ్మవార్ల హుండీల్లో సొమ్ములు వేయటానికి ప్రయత్నిస్తుండగా గమనించి దొంగ ఆతని చేతిలో క్యాష్‌బ్యాగ్‌ను తస్కరించి పరుగులు తీసాడు. దాంతో అక్కడే ఉన్న సెక్యూరిటి సిబ్బంది,హోంగార్డులు వెంబడించి పట్టుకున్నారు.శ్రీకాళహస్తీశ్వరాలయంలో భక్తులతో పాటు దొంగలు వస్తున్నారు. క్యూలైన్లలో భక్తులతో పాటు వెళుతూ జేబులు కట్ చేయటం అలాగే మహిళల మెడలో నగలు కట్ చేయటం పరిపాటిగా మారింది.శుక్రవారం ఆలయంలో రద్దీ అధికంగా ఉంది. ఇదే అదునుగా గమనిస్తున్న దొంగ అదుపులో తీసుకున్నారు.ఆతనిది తొట్టంబేడు మండలం రామచంద్రాపురం అని ఆతని పేరు నారాయణమూర్తి అని కొందరు మదనపల్లి సమీపంలోని మొకలచెరువు అని కొందరు చెబుతున్నారు. అయితే ఆతని వద్ద ఎలాంటి అధారాల్లేదు.దాంతో ఆతన్ని వన్‌టౌన్ పోలీసులకు అప్పగించారు.

## ఉచిత మరుగు దొడ్డలకు కరెంటు లేదు



శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 26 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయానికి వస్తున్న పేద,మధ్యతరగతి భక్తుల సదుపాయాల కల్పనపట్ల దేవస్థాని నిర్లక్ష్యం అంతా ఇంతా కాదు. భక్తులకు కల్పిస్తున్న సదుపాయాల అమలుకు సంబంధించి పట్టించుకునే నాథుడే లేదు.ఈ నేపథ్యంలో వైకాపా హయాంలో రూ.36లక్షలతో ఉచిత మరుగుదొడ్లను నిర్మించారు. అయితే అవుట్ లెట్ లేకుండా నిర్మించినందువల్ల ఆ పార్టీ హయాంలో ప్రారంభించలేదు. తరువాత వచ్చిన కూటమి ప్రభుత్వంలో భక్తుల సౌకర్యార్థం ప్రారంభించారు. అవుట్‌లెట్‌తో పని లేకుండా ఏర్పాట్లు చేసారు.ఈ వెసులుబాట్లును భక్తులు ఎంతో చక్కగా ఉపయోగించుకుంటున్నారు. అయితే శుక్రవారం ఈ ఉచిత మరుగుదొడ్లకు బీగాలు తగిలించారు. కారణం ఇక్కడ విద్యుత్ సరఫరా లేదు. దాంతో నీళ్ళు రాకపోవటంతో బీగాలు తగిలించారు.సాధారణంగా ఆలయానికి విధులకు వచ్చే అధికారులందరూ ఇదే దారిలో వెళతారు. కానీ ఎందుకో ఎవరికి వారు అన్నట్లు మారింది. శుక్ర,శని,ఆది,సోమవారాల్లో భక్తుల తాకిడి అధికంగా ఉంటుంది. అధికారులు స్పందించాలని కోరుతున్నారు.ఈ మేరకు బిజెపి నాయకుడు గరికపాటి రమేష్‌బాబు ఆలయాధికారుల తీరును ఖండించారు.

## ఓబిసి కాంగ్రెస్ నాయకుని సత్కరించిన శ్రీకాళహస్తి



శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 26 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి నియోజకవర్గ కేంద్రమైన శ్రీకాళహస్తి కాంగ్రెస్ కార్యాలయంలో శుక్రవారం మైనారిటి జిల్లా నాయకుడు షేక్ కరీముల్లా రాష్ట్ర ఓబిసి నాయకుని ఘనంగా సత్కరించారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి భాస్కర్ యాదవ్‌ను తిరుపతి జిల్లా మైనారిటి సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ కరీముల్లా ఆహ్వానించారు. ఓబిసిల హక్కుల సాధనకు భాస్కర్ యాదవ్ చేస్తున్న కృషి అభినందనీయం అన్నారు. రాహుల్ గాంధీ నేతృత్వంలో సాగుతున్న ఓట్ చోర్ గద్దెదిగాలి కార్యక్రమాలను ప్రజల్లో తీసుకెళ్ళి విజయవంతం చేయటానికి విశేష కృషి చేస్తున్నారని అభినందిస్తూసత్కరించారు.ఈ కార్యక్రమాల్ల పార్టీకి చెందిన ఎస్ చిరంజీవి, అర్జున గురుమూర్తి, నిత్యానందం,లు హాజరయ్యారు. సన్మాన కార్యక్రమాల్లో షేక్ అన్సర్, పూజారి చలపతి తదితరులు పాల్గొన్నారు.

## మహాలక్ష్మీ దేవిగా కాళికా మాత



శ్రీకాళహస్తి రూరల్,సెప్టెంబర్ 26 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి మండలం వేడాం గ్రామం వద్ద వెలసిన దక్షిణ కాళీమాత ఆలయంలో వెలసిన అమ్మవారికి నవరాత్రి మహోత్సవాల సందర్భంగా మహాలక్ష్మీ అలంకారాన్ని నిర్వహించారు.ఆలయ పూజారి చంద్రస్వామి అమ్మవారికి ప్రత్యేక అలంకారాలతో ఆకట్టుకుంటున్నారు. కైలాసగిరుల్లో వెలసిన అమ్మవారు మహిమాన్వితమైనదిగా చెబుతారు. శ్రీకాళహస్తి పట్టణం నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాలైన తమిళనాడు,కర్నాటకల నుంచి విశేష సంఖ్యలో భక్తులు హాజరౌతున్నారు.ఈ నేపథ్యంలో శుక్రవారం రాహుకాల సమయంలో పూజలకు భవాని మాలలు ధరించిన మహిళలు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. అమ్మవారి అభిషేక సేవల్లో పాల్గొన్నారు. భక్తులకు సహాపంక్తి భో జనాలు ఏర్పాటు చేసారు.

## విభూదీ అలంకారంలో పార్వతీ దేవి



శ్రీకాళహస్తిరూరల్,సెప్టెంబర్ 26 ప్రభాతవార్త: ఏర్పేడు మండలంలోని కందాడు గ్రామంలో వెలసిన మహిమాన్విత శివ క్షేత్రంగా ప్రసిద్ది చెందింది. ఇక్కడ వెలసిన కామాక్షి దేవి సదాశివేశ్వర దేవస్థానంలో వెలసిన అమ్మవారికి దసరా ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక పూజలు,అభిషేకాలు అలంకారాలు నిర్వహిస్తున్నారు.ఈ నేపథ్యంలో శుక్రవారం ఉభయదారులు మునెయ్య,దేవి దంపతుల సారథ్యంలో కామాక్షి అమ్మవారికి కన్నులు మిరుమిట్లు గొల్పునట్లు విభూదీ అలంకారం నిర్వహించారు. అమ్మవారి దర్శనానికి చుట్టుపక్కల గ్రామాలకు చెందిన మహిళలు హాజరయ్యారు.శుక్రవారం కావటంతో ఆలయ ధర్మకర్తలు నారాయణ స్వామి, ధనంజయస్వామి, పండుస్వామిలు తీర్థ ప్రసాదాలను ఏర్పాటు చేసారు. సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేసారు. మహిళలు శుక్రవారం కావటంతో దీపాలను వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.ఈ కార్యక్రమాల్లో దాము, మల్లికార్జున్, బాలకృష్ణ,విజయకుమార్,సత్యం, మాధవయ్య తులసి, మునెయ్య, భక్తవత్సల రాజు పాల కుమార్,జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## దసరా సెల్లవుల్లో ఒకేషనల్ కోర్సులు



శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 26 ప్రభాతవార్త: శ్రీకాళహస్తిలోని ఆర్‌పిబియస్‌జడ్‌పి ఉన్నత పాఠశాలలో విద్యార్థులను దసరా సెలవుల్లో అటు తిరగకుండా పాఠశాల ప్రధానోపాధ్యాయులు తీగల వెంకటయ్య సారథ్యంలో ఒకేషనల్ కోర్సులతో శిక్షణ ఇస్తున్నారు.ఈ నేపథ్యంలో పలువు విద్యార్తులకు ఒకేషన్ కోర్సులో భాగంగా ఎలక్ట్రానిక్స్,ఆటోమేటివ్ కోర్సుల్లో శిక్షన ఇస్తున్నట్లు ఆయన వివరించారు.ఈ కార్యక్రమాల్లో ఎలక్ట్రానిక్ ట్రైనర్ అనిల్‌కుమార్ ఆటోమోటివ్ ట్రైనర్ కుమారిలు పాల్గొన్నారు.

## దుర్గమ్మను దర్శించుకు మాజీ ఎంఎల్‌ఏ



శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 26 ప్రభాతవార్త: శ్రీకాళహస్తిలో జరుగుతున్న దేవి నవరాత్రి మహోత్సవాల సందర్భంగా శుక్రవారం మాజీ శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి తన సహచరులతో కలసి కనకాచలంపై వెలసిన దుర్గమ్మను దర్శించుకున్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న దుర్గమ్మ ఆలయానికి శుక్రవారం మహిళా భక్తులు విశేష సంఖ్యలో హాజరై దర్శించుకోవటం ఆనవాయితి. ఈ నేపథ్యంలో శుక్రవారం అమ్మవారికి స్కందమాత అలంకారాన్ని ఆలయ పూజారి తులసీశర్మ నిర్వహించారు. మాజీ శాసనసభ్యుడు పిట్టవారి సందు వీధిలోని మెట్లపై నుంచి అమ్మవారి దర్శనానికి వెళ్ళారు. దిగువన ఉన్న కాలభైరవుని దర్శించుకోని అమ్మవారి కొండకు ఎక్కారు. ఆయనతో పాటు మాజీ ధధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు, మున్నారాయల్ జయశ్యాం,సురేష్, గణేష్,యశ్వంత్‌రెడ్డి, కుమార్, మణి, రవి, సతీష్, సూర్య, బాబి తదితరులు వెంటరాగా అమ్మవారికి దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనం చేసుకున్న నాయకులకు పూజారి తులసీ శర్మ ఆశీర్వదించారు.

## రేపు ఎంజిఎం సారథ్యంలో 3కె రన్

శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 26 ప్రభాతవార్త: శ్రీకాళహస్తిలోని ఎంజిఎం కార్పొరేట్ ఆసుపత్రి సారథ్యంలో ప్రపంచ హృదయదినోత్సవం సందర్భంగా ఆదివారం నిర్వహించనున్నారు అయితే ఒక రోజు ముందుగానే నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ గుడ్లూరు మయూర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం ప్రపంచ హృదయదినోత్సవం ఉంది.అయితే ఒక రోజు ముందుగానే తాము 3కు.రన్‌ను నిర్వహించుటకు సన్నాహాలుచేస్తున్నట్లు మయూర్ వివరించారు.ఈ సదవకాశాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకొని విజయవంతం చేయాలని కోరారు.ఆదివారం ఉదయం 8గంటలకు ఎంజిఎం ఆసుపత్రి నుంచి టూ టౌన్ పోలీసు స్టేషన్ వరకు సాగుతుందని వివరించారు.

## అనందవల్లి అలంకారం



శ్రీకాళహస్తి,రూరల్,సెప్టెంబర్ 26 ప్రభాతవార్త: ఏర్పేడు మండలం గుడిమల్లం లోని పరశురామేశ్వరా లయంలో వెలసిన అమ్మవారికి దసరా ఉత్సవాల సందర్భంగా శుక్రవారం అమ్మవారికి అనందవల్ల అలంకారం జరిపారు. ఇక్కడి ఆలయంలో దసరా ఉత్సవాలను భారీ ఎత్తున నిర్వహిస్తున్నారు. ఆలయాన్ని ప్రత్యేకంగా ముస్తాబులు చేసారు. ఆలయంలో వెలసిన అనంద వల్లి అమ్మవారికి అనందవల్లి అలంకారం జరిపారు. చుట్టుపక్కల గ్రామాలకు చెందిన మహిళలు విశేషంగా హాజరై పూజలు జరుపుకున్నారు. మొక్కులు తీర్చుకున్నారు.ఏర్పాట్లును మాజీ అధ్యక్షులు బత్తల గిరినాయుడు దంపతులు ఉభయదారులుగా ఉన్నారు. ఆలయ ఇఓ రామచంద్రరెడ్డి పర్యవేక్షించారు. ఆలయ నిర్వహణ బాధ్యతను వరలక్ష్మీ నరసింహారావు, విజయకుమార్,మధు, వివిఎం రాజా,ఆనంద్‌జీ, కోలా సరళ, రవికిరణ్, ఉన్నం వేణుగోపాల్‌నాయుడు, బాలాజి నాయుడు విద్యాసాగర్ నాయుడు, గోపి నాయుడులు ఉభయదారులుగా వ్యవహారించారు.

## శ్రీ తాతయ్యగుంట గంగమ్మకు అభిషేకము, హోమము



తిరుపతి రవాణా, సెప్టెంబర్ 25 ప్రభాతవార్త: శ్రీ దేవీ శరన్నవరాత్రి ఉత్సతవాల్లో భాగంగా శుక్రవారము ఉదయం అభిషేకము, హోమము మరియు కుంకుమార్చన కార్యక్రమములు వైభవముగా జరిగినవి. తదుపరి రాత్రి ఊంజలిసేవ నందు అమ్మవారు శ్రీ మహాలక్ష్మి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమములో ఉభయదాతలు, ఆలయ చైర్మన్‌నైనార్ మహేష్ యాదవ్ మరియు పాలక మండలిసభ్యులుయం గుణ, శ్రీమతి జి భాగ్యవల్లి, బి సుబ్రహ్మణ్యం, రాజా రుద్ర కిషోర్, ఎ వరలక్ష్మి,పి విమల,టి చంద్రశేఖర్, యన్ శ్యామల, యు.మధులత, ఇ.లక్ష్మణరావు పాల్గొనడం జరిగిందని ఆలయ చైర్మన్ నైనార్ మహేష్ యాదవ్ మరియు కార్యనిర్వహణాధికారి ఎ. జయకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు

## గోవింద భక్తులకు అన్నదానం, ఉచిత వైద్య శిబిరం



వడమాలపేట, సెప్టెంబరు 26 ప్రభాతవార్త: తమిళనాడు నఉంచి తిరుమలకు కాలినడకన వెళ్లే భక్తులకు తడుకు ఆర్‌ఎస్ వద్ద శుక్రవారం అన్నదానం, ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. బాలాజీ అన్నదాన ట్రస్టు ఆధ్వర్యంలో ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజనం సుమారు మూడు వేల మంది భక్తులకు వడ్డించారు. అలాగే తిరుపతి గంటా న్యూరో ఆస్పత్రి ఆధ్వర్యంలో న్యూరాలజిస్టు రాజశేఖర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి భక్తులకు పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. గత 19 సంవత్సరాలుగా శ్రీవారి బ్రహ్మోత్సవ రోజుల్లో గోవింద భక్తులకు అన్నదానం చేస్తున్నారు. ట్రస్టు సభ్యులు శ్రీధర్‌రాజు, రాజేంద్రరాజు, దామోదర్‌రెడ్డి, రామచంద్ర రాజు, నాయకులు అమ్ములు, నారాయణబాబు, భాస్కర్ రెడ్డి, రామారావు తదితరులు పాల్గొన్నారు.

## మహాలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనం

సత్యవేడు, సెప్టెంబరు 26 ప్రభాతవార్త:



సత్యవేడు మండలం ఇరుగుళం శ్రీ ఉమామహేశ్వర స్వామి ఆలయంలో శ్రీ ఉమామహే శ్వర స్వామి ఆలయంలో అమ్మవారు మహాలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ధర్మకర్త, ఎంపీపీ ప్రతిమ సుశీల్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో నవరాత్రి వేడుకలు జరుగుతుంది. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉమామహేశ్వరి అమ్మవారికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ క్రమంలో ఆలయ ధర్మకర్త ఎంపీపీ ప్రతిమ సుశీల్‌కుమార్‌రెడ్డి దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. కుంకుమార్చన నిర్వహించారు. అమ్మవారికి ప్రధాన హారతి అనంతరం భక్తులకుదరికి నిర్వాహకులు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

## శ్రీవారి గొడుగులు యాత్రికులకు అన్నదానం : ఎమ్మెల్యే

సత్యవేడు, సెప్టెంబరు 26 ప్రభాతవార్త:



సత్యవేడు నియోజకవర్గం పిచ్చాటూరు మండలంలో శ్రీవారి గొడుగులతో పాదయాత్రగా తిరుమల వెళుతున్న యాత్రికులకు అన్నదానం చేయడం తన మహద్భాగ్యంగా భావిస్తున్నట్లు ఎమ్మెల్యే ఆదిమూలం అన్నారు. శుక్రవారం మధ్యాహ్నం శ్రీవారి గొడుగులు పిచ్చాటూరుకు చేరుకుంది. ఈ నేపథ్యంలో స్థానిక ఎంకెటీ కల్యాణ మండపంలో శ్రీవారి గొడుగులు యాత్రికులకు అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీవారి గొడుగులు సత్యవేడు నియోజకవర్గంలోని నాగలాపురం, పిచ్చాటూరు, నారాయణవనం మండలాలు గుండా వెళ్ళడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ ఇళంగోవన్‌రెడ్డి, తెలుగుదేశం పార్టీ నాయకులు పద్దురాజు, రవి రెడ్డి, వాసురెడ్డి, దొరవేలురెడ్డి, మురళి, రవి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ గజలక్ష్మి అలంకరణలో శ్రీ ద్రౌపదీదేవి



పుత్తూరు రూరల్, సెప్టెంబరు 26 ప్రభాతవార్త: పుత్తూరు పట్టణంలోని శ్రీ ద్రౌపదీ సమేత శ్రీ ధర్మరాజుల స్వామి ఆలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు సందర్భంగా శుక్రవారం అమ్మవారిని శ్రీ గజలక్ష్మి అలంకరణలో అలంకరించారు. ఉదయం ఆలయంలోని శ్రీ ద్రౌపదీదేవి ధర్మరాజుల స్వామి మూల ఉత్సవ విగ్రహాలకు అభిషేకాలు, అలంకరణలు చేశారు. సాయంత్రం ప్రత్యేక పుష్పాలతో అలంకరించి పూజలు చేశారు. భక్తులు అమ్మవారికి మంగళ హారతులు ఇచ్చి పూజలు చేశారు. ఉభయ దాతగా పుత్తూరు కాపు వీధికి చెందిన కె.జయంతి(వైఫ్ ఆఫ్ లేట్ ఎల్లముత్తు) కుమారులు కె.సత్యనారాయణ, కె.ఉమా దంపతులు వ్యవహరించారు. కార్యక్రమంలో ఆలయ కోవిల్‌కార్ సాల్వాకం కిష్టప్ప మొదలి, ఆలయ గుడి పూజారి సి.మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్‌గా రెడ్డిశేఖర్



తిరుపతి విద్య, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త: శ్రీ వెంకటేశ్వర వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ గా డాక్టర్ ఎంరెడ్డి శేఖర్‌ను నియమిస్తూ ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ వర్సిటీ విడుదల చేసిన ఉత్తర్వులకు అనుగుణంగా శుక్రవారం కళాశాల అసోసియేట్ డీన్ గా బాధ్యతలు స్వీకరించారు.డాక్టర్ ఎం రెడ్డి శేఖర్ వ్యవసాయ వర్సిటీ లో బోధన, పరిశోధన రంగంలో 32 సంవత్సరాల విశేష అనుభవం గడించారు. డాక్టర్ రెడ్డి శేఖర్ ఆధ్వర్యంలో జెనెటిక్స్ అండ్ ప్లాంట్ బ్రీడింగ్ విభాగం నందు 60 మంది పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు, 16 పీహెచ్డీ విద్యార్థులు పట్టాలు పొందడం జరిగింది. దీనితోపాటు పలు జాతీయ అంతర్జాతీయ జర్నల్స్ నందు 125 పరిశోధన పత్రాలు సమర్పించడం జరిగింది. వీటితోపాటు భారత వ్యవసాయ పరిశోధన మండలి ఉత్తమ ఉపాధ్యాయుడిగా 2010 సంవత్సరం ఎన్జీరంగా వర్సిటీ ఉత్తమ ఉపాధ్యాయుడిగా 2013వ సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయుడిగా 2017 వ సంవత్సరం అవార్డులు అందుకోవడం జరిగింది. బాధ్యతలు స్వీకరించిన అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ బోధన మరియు పరిశోధనా రంగాలలో కళాశాలను మరింత అభివృద్ధి పథంలో తీసుకెళ్లడానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

## సంస్కృతి కల్చరల్ ఆర్ట్ సొసైటీచే హస్తకళ మేళా



తిరుపతి విద్య, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త: తిరుపతి ఎలైట్ సోషల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక మంగళం రోడ్ లోని ఉపాధ్యాయ నగర్ 11 వ క్రాస్ లో చేనేత, హస్తకళల మేళా శుక్రవారం ప్రారంభం అయింది. శుక్రవారం నుంచి 15 రోజులు పాటు జరిగేఈ మినీ మేళాలో వివిధ రాష్ట్రాల నుండి విచ్చేసిన 35 మంది కళాకారులు తమ ఉత్పత్తులు ను అమ్మకం కోసం అందు బాటులో ఉంచారు. ముఖ్యంగా జైపూర్‌కి చెందిన బెడ్ షీట్స్, సహరంగపూర్ ఉత్తరప్రదేశ్‌కి చెందిన చెక్క తో తయారుచేసిన గృహాలంకరణ వస్తువులు,కలంకారి చీరలు,మీరట్ నుండి వచ్చిన చెప్పులు,మన రాష్ట్రానికి చెందిన కొండపల్లి బొమ్మలు, కడపకి చెందిన చేనేత టవల్స్,కాటన్ షర్ట్స్ ఖాదీ టాప్,షోలాపూర్ చెప్పులు,హైదరాబాద్‌కి చెందిన హ్యాండ్ లూమ్ ప్రింటెడ్ చీరలు,డ్రెస్ మెటీరియల్స్ మొదలైన 20 మంది కళాకారులు చే మినీ మేళాలో ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

## రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి!



పాకాల, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త: పాకాల మండలం రైల్వే స్టేషన్ సమీపాన ఉన్న ఉప్పరపల్లి వద్ద గుర్తుతెలియని రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం అర్ధరాత్రి చోటు చేసుకున్నదనీ రైల్వే ఆర్పిఎఫ్ పోలీసులు తెలిపారు. గుర్తు తెలియని మగ వ్యక్తి వయస్సు సుమారు 30 సంవత్సరాలు ఉంటుందని రైల్వే ట్రాక్ మధ్యలో మృతదేహం పడి ఉందన్నారు. మృతుడు తెల్లని షర్టు మీద నల్ల గీతలు కలిగి ఉన్న బ్లూ కలర్ లోయర్ వేసుకొని ఉన్నాడని తెలిపారు. పాకాల ఆర్పిఎఫ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేశాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని వివరాలు తెలిసిన వాళ్లు పాకాల ఆర్పిఎఫ్ పోలీసు వారిని సంప్రదించాలని తెలిపారు.

## ప్రవక్త ఆచరించిన సత్యసంధతను ఆచరించాలి: రేహాన్



శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 26 ప్రభాతవార్త: ఇస్లాంమత వ్యాప్తికి చిట్టచివరి ప్రవక్త మహమ్మద్ సొల్లె అలా సొల్లం ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఒకే దేవుడు అంటూ దివ్యఖుర్ ఆన్ బోధనలను ప్రజలకు వివరించటంలో ఇక్కట్లు ఎదుర్కొ న్నారు. కానీ నేడు మనం చూపుడు ముస్లింలుగా ఉంటున్నామని ఈ ధోరణిలో మార్పు రావాలని హాఫీజే ఖుర్ ఆన్ రేహాన్ అన్నారు. శుక్రవారం శ్రీకాళహస్తిలోని జామియా మస్‌జిద్‌లో ప్రత్యేక ప్రార్థనల సందర్భంగా ఆయన బోధనలు చేస్తూ ఇస్లాం మతం సత్యసందతను బోధిస్తుంది. కానీ మనం దానిని విస్మరిస్తున్నాము. నేడు మన కట్టుబొట్టు ఇతరులను అనుకరిస్తున్నాము తప్ప మహమ్మద్ ప్రవక్త ఆచరించిన విధానాలను పట్టించుకోవటం లేదన్నారు. ఆయన ఆచరించిన ఒక్కొక్క సత్యసంధతను ఆచరిం చటం లేదన్నారు. మనం మొదట సంప్రదాయాలను ఆచరించాలి, ఎవరైనా సరే 'సలాం' చేయటం సంస్కారమని దానిని అమలు చేయాలన్నారు.

# తిరుపతి డివిజన్

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి : డాక్టర్ సుకన్య



తిరుపతిరూరల్,సెప్టెంబర్26 ప్రభాతవార్త: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని దామినేడు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుకన్య సూచించారు. శుక్రవారం తిరుపతిరూరల్ మండలం అవిలాల గ్రామ పంచాయతీలో 'స్వస్త్ నారీ శక్తి పరివార్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. డాక్టర్ సుకన్య ఆధ్వర్యంలో పంచాయతీలోని ప్రజలకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణి చేసారు. ప్రజలకు వైద్య పరీక్షలతో పాటు రక్త పరీక్షలు నిర్వహించి, తగిన సలహాలు, సూచనలు చేసారు. ప్రమాదకర వ్యాధుల సూచనలు కన్పిస్తే స్విమ్స్, రుయాకు సిఫారస్సు చేస్తున్నట్లు డాక్టర్ సుకన్య తెలిపారు. పంచాయతీలోని ప్రజలు వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అవిలాల గ్రామ సర్పంచ్ చెందేలి వెంకటరమణ, డాక్టర్ నిరంజన్ బాబు, సూపర్‌వైజర్ క్రిష్ణప్రియ, టిడిపి నాయకులు సాంబయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఎల్లమ్మకు పట్టువస్త్రాలు సమర్పించిన తుడ చైర్మెన్

-మహాలక్ష్మీ దేవి అలంకరణలో మూలస్థాన ఎల్లమ్మ



తిరువతిరూరల్, సెప్టెంబర్26 ప్రభాతవార్త: దేవి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శుక్రవారం శ్రీమూల స్థాన ఎల్లమ్మ మహాలక్ష్మీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. తిరుపతిరూరల్ తుమ్మల గుంట చెంచువారి కాలనీలో వెలసిన శ్రీ మూలస్థాన ఎల్లమ్మ ఆలయంలో దేవి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. తుడ చైర్మెన్ డాలర్ దివాకర్‌రెడ్డి దంపతులు మూలస్థాన ఎల్లమ్మకు పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయ ధర్మకర్త బిరుదాల సిద్దారెడ్డి తుడ చైర్మెన్ దంపతులకు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేసి, తీర్థప్రసాదాలు అందజేసారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో ఉభయదారులు తుడ చైర్మెన్ డాలర్ దివాకర్‌రెడ్డి, సతీమణి మౌనిక, కుమార్తె గెహనీరెడ్డి, కేతన్‌సాయి, విష్ణుసాయిరెడ్డిలతో పాటు టిడిపి సీనియర్ నేత బిరుదాల హనుమంత్‌రెడ్డి, తులసీరామిరెడ్డి, పార్లపల్లి భరత్‌కుమార్‌రెడ్డిలు పాల్గొని, భక్తులకు అన్నదానం చేసారు.

## చెర్లోపల్లి గ్రామ సర్పంచ్‌గా చంద్రశేఖర్



తిరుపతిరూరల్,సెప్టెంబర్26 ప్రభాతవార్త: తిరుపతి రూరల్ చెర్లోపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా కూరగాయల చంద్రశేఖర్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. చెర్లోపల్లి గ్రామ సర్పంచ్ బొల్లినేని సుభాషిణి అకస్మిక మరణంతో సర్పంచ్ సీటు ఖాళీగా ఉన్న విషయం తెల్సిందే. ఉప సర్పంచ్‌గా ఉన్న చంద్రశేఖర్ ఇన్‌చార్జి సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈసందర్భంగా సర్పంచ్ చంద్రశేఖర్ మీడియాతో మాట్లాడుతూ పంచాయతీలో పారిశుధ్య పనులకు పెద్దపీట వేస్తానని, పారిశుధ్యం మెరుగుపరుస్తామని తెలిపారు. పంచాయతీలో వున్న ఇంటి యజమానులు సకాలంలో ఇంటిపన్నులు చెల్లించి, పంచాయతీ అభివృద్దికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో దివంగత సర్పంచ్ సుభాషిణి భర్త, క్లాస్‌వన్ కాంట్రాక్టర్ బొల్లినేని శుభగిరి, టిడిపి సీనియర్ నేత వైకుంఠం శ్రీధర్ నాయుడు, పంచాయతీ కార్యదర్శి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

## మహాలక్ష్మీ దేవి అలంకరణలో శ్రీశక్తి చాముండేశ్వరిదేవి



తిరుపతిరూరల్,సెప్టెంబర్26 ప్రభాతవార్త: దేవీ శరన్నవరాత్రులలో భాగంగా ఐదోవ రోజు శ్రీశక్తి చాముండేశ్వరి దేవి మహాలక్ష్మీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. తిరుపతిరూరల్ తుమ్మలగుంట క్రాస్, ఎల్ఎస్ నగర్‌లో వెలసిన శ్రీశక్తి చాముండేశ్వరి ఆలయంలో దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు కన్నులపండవుగా జరుగుతున్న విషయం తెల్సిందే. శుక్రవారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేకం, అలంకారము, హోమం నిర్వహించారు. ఉభయ దారులుగా మునిరాజ, చంద్రబాబు,విజయరాఘవరెడ్డి,మునికృష్ణారెడ్డి, శంకర్ నాయుడు, వెంకటేశ్వరరెడ్డి, బ్రహ్మానందరెడ్డి, మురగయ్య, పుష్పావతి తదితరుల ఆధ్వర్యంలో మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేసారు. ఉభయదారులకు ఆలయధర్మకర్త బిరుదాల భాస్కర్‌రెడ్డి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేసి, అమ్మవారికి చీరతో పాటు అమ్మవారికి తీర్థప్రసాదాలు అందజేసారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధులుగా తుడ చైర్మెన్ డాలర్ దివాకర్‌రెడ్డి దంపతులు, బిజెపి నాయకులు నవీన్‌కుమార్‌రెడ్డి తదితరులుపాల్గొన్నారు.

## కూష్మాండ అలంకరణలో చతుర్ద దుర్గ

-వైభవంగా "శ్రీ ఉగ్రప్రత్యంగిరాకాళి" నవరాత్రి ఉత్సవాలు



చంద్రగిరి, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త: కూష్మాండ అలంకరణలో చతుర్ద దుర్గ భక్తులకు దర్శనమిచ్చారు. తొండవాడ పంచాయతీలోని శ్రీ ఉగ్రప్రత్యంగిరా కాళీపీఠంలో శరన్నవరాత్రి ఉత్సవాలను పీఠాధిపతి సూరీ స్వామి అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం అమ్మవారికి అభిషేకం జరిపించారు. అనంతరం అమ్మవారి ఉత్సవమూర్తి వివిధ రకాల సుగంధభరిత పుష్పాలు, బంగారు ఆభరణాలతో విశేష అలంకరణతో దేదీప్యమానంగా ముస్తాబు చేశారు. అమ్మవారి సేవకు తిరుపతికి చెందిన యమహా షోరూమ్ డి.శ్రీదర్, డి.మాలిని, ముంబాయికి చెందిన శ్రీకాంత్, సౌమ్య అద్వైత్ దాతలుగా వ్యవహరించారు.

## కమలాత్మికా దేవిగా మరకతశక్తి కాళిదేవి



రామచంద్రాపురం, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త: రాయలచెరువు సమీపంలో వెలసియున్న శ్రీశక్తి పీఠంలో శుక్రవారం శ్రీకమలాత్మికాదేవి అలంకరణలో శ్రీమరకతశక్తి కాళిదేవి భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీశక్తిపీఠం వ్యవస్థాపకులు కుర్తాళం పీఠాధిపతి సిద్దేశ్వరనంద మహాభారతి స్వామి ఆధ్వర్యంలో మంత్రమహేశ్వరి రమ్యానందభారతి పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం నూతన వస్త్రాలు, వివిధ రకాల పుష్పాలతో అమ్మవారిని సుందరంగా తీర్చిదిద్ది భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. స్త్రీమూర్తులకు సువాసిని పూజ జరిపించారు. సాయంత్రం కళాకారులచే గానకచ్చేరి, మాతాజీచే అమ్మవారికి దర్బారుసేవ నిర్వహించారు. దేశవిదేశాల నుండి వచ్చిన భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.

## ఇసుక అక్రమ రవాణా నేరం : తహసిల్దార్



రేణిగుంట సెప్టెంబర్ 26 ప్రభాతవార్త ఇసుకను అక్రమంగా రవాణా చేయడం నేరమని రేణిగుంట తహసిల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి స్పష్టం చేశారు. రేణిగుంట మండలం కుర్ర కాలవ వద్ద తహసిల్దార్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో అక్రమంగా ఇసుకను ప్రమాణా చేస్తున్న ఐదు ట్రాక్టర్లను వెనుక తొట్లతో సహా పట్టుకున్నారు. వీటిని సీజ్ చేసి తాహసిల్దార్ కార్యాలయానికి తరలించారు. ఇసుకను, మట్టిని నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా తరలిస్తే చర్యలు కఠినంగా తీసుకుంటామని చంద్రశేఖర్ రెడ్డి హెచ్చరించారు.

## శాస్త్రవేత్త శ్రీనివాసరావుకు అతి ప్రతిష్టాత్మక అవార్డు



రేణిగుంట, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త : కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త, కేంద్రం హెడ్ డాక్టర్ శ్రీనివాసరావుకు ఉత్తమ శాస్త్రవేత్త పురస్కారం లభించింది. ఏరువాక ఫౌండేషన్ గుంటూరు నందు జరిగిన కిసాన్ మహోత్సవ 2025 కార్యక్రమంలో ఉత్తమ అగ్రానమి శాస్త్రవేత్త అవార్డును ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ మిషన్ మిషన్ వైస్ చైర్మన్ మర్రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, ప్రముఖ ఎడిటర్ రాఘవరావు, ఎంఎస్ఎంఈ చైర్మన్ తమ్మిరెడ్డి శివశంకర్ చేతుల మీదుగా అందుకున్నారు. అవార్డు అందుకుంటున్న సందర్భంగా శాస్త్రవేత్త శ్రీనివాసరావు దంపతులను ఘనంగా సత్కరించారు. అవార్డు అందుకున్నందుకు శ్రీనివాసరావును కె వి కె చైర్మన్ డాక్టర్ వెంకటరత్నం, రాస్ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు అభినందించారు.

## యువతరంగ్ మహోత్సవానికి మంత్రికి ఆహ్వానం



తిరుపతి విద్య, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త: ఎస్వీయూ లో అక్టోబర్ 16 నుంచి 18 వరకు జరగనున్న యువతరంగ్ 2025 సాంస్కృతిక మహోత్సవానికి రాష్ట్ర రవాణా,యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి మాండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ని ఆహ్వానించబడినది. ఈ ఆహ్వానం ద్వారా ప్రభుత్వంకు చెందిన విద్యాసంస్థల్లో క్రీడలు, సాంస్కృతిక కార్యకలాపాల ప్రోత్సాహానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని మరోసారి స్పష్టమవుతుంది.మహోత్సవానికి హాజరు ఔతాను అని మంత్రి సానుకూలంగా స్పందించారు. ఆనిమిని రవి నాయుడు అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రీడల ప్రాధికార సంస్థ,సాంస్కృతిక సమన్వయకర్త డాక్టర్ పి.వివేక్‌లు కలిసి మంత్రి నీ ఆహ్వానించారు.

# వీధి వ్యాపారుల అభివృద్ధే కూటమి లక్ష్యం : జిల్లా జీవనోపాధికారి



గూడూరు, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త: వీధి వ్యాపారుల ఆర్థిక అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని జిల్లా జీవనోపాదుల అధికారి ప్రమీల తెలిపారు. శుక్రవారం గూడూరు పట్టణం మాయా బజార్‌లో ఉన్న ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో వీధి వ్యాపారులకు పీఎం స్వానిధి 2.0 వర్షన్ పై లోక కళ్యాణ వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ గూడూరు పట్టణంలోని వీధి వ్యాపారులకి ప్రభుత్వం రుణాలను విరివిగా మంజూరు చేస్తుందని అందుకు అవసరమైన ధ్రువపత్రాలతో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. పీఎం స్వానిది పథకాన్ని ప్రతి ఒక్క వీధి వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. బ్యాంకర్లు, వీధి వ్యాపారులకు డిజిటల్ ట్రాన్సాక్షన్స్, బ్యాంకు రుణాలు పొందేందుకు అవగాహన కల్పించారు. అనంతరం ఉచిత వైద్య శిబిరం కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకర్లు, సునీత సేవా సంస్థ నిర్వాహకరాలు సారంగం సులక్ష్మి, మెప్మా సిఓలు విష్ణు, కృష్ణయ్య, వెంకయ్య, శ్రీను, టిఎల్ఎఫ్ఆర్‌పిలు పి.లక్ష్మి, సుజాత, డీఈవో ఉష, ఎస్ఎల్ఎఫ్ ఆర్‌పిలు, చిరు వ్యాపారులు పాల్గొన్నారు.

## శ్రీకన్యకాపరమేశ్వరికి గాయత్రి అలంకారం



సూళ్లూరుపేట, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త: శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రులలో భాగంగా అమ్మవారు శ్రీగాయత్రి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చింది. అలంకారానికి అయితా రాజశేఖర్ ఉభయకర్తగా ఉన్నారు. గర్భాలయంలో మూలవిరాట్‌కు గవ్వలతో కూడిన మత్స్యకన్యక అలంకారాన్ని ప్రత్యేకంగా చేశారు. పైడిమర్రి కిషోర్, అద్దంకి శ్రీనివాసులు దంపతులు ప్రసాద ఉభయకర్తలుగా వ్యవహరించారు.

## ఎయిడ్స్‌పై అవగాహన ప్రదర్శన



సూళ్లూరుపేట, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త: నవజీవన్ ఆర్గనైజేషన్ సిసిపియు ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఇంటన్సిఫైడ్ ఐఇసి కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వా సుపత్రిలో ప్రదర్శన ప్రారంభించి పట్టణంలో ప్రజలకు ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. ఎయిడ్స్ సోకకుండా, సోకిన తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు మేనేజర్ కె.బాలాజీ, ఎఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

## వేనాటి జన్మదిన వేడుకలు



సూళ్లూరుపేట, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త: తెలుగుదేశం తిరుపతి పార్లమెంటరీ పార్టీ ప్రధాన కార్యదర్శి వేనాటి సతీష్‌రెడ్డి జన్మదిన వేడుకలను శుక్రవారం ఆయన అభిమానులు, పార్టీ నేతలు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. అనంతరం కోళ్లమిట్ట వద్ద హెచ్‌డిఆర్ లాడ్జి సమీపంలో 500 కేజీల భారీ కేక్ కట్ చేశారు. వేనాటి అభిమానులు, టిడిపి కార్యకర్తలు పెద్దసంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## కోటలో సామూహిక కుంకుమార్చన పూజలు



కోట, సెప్టెంబర్ 27 ప్రభాతవార్త: కోటమ్మ తల్లి అమ్మవారి ఆలయంలో జరుగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆలయ ప్రాంగణంలో ఉన్న వైష్ణవి దుర్గాదేవి ఆలయంలో సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. ఆలయ ధర్మకర్త నల్లపరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, లక్ష్మీకవితమ్మ దంపతుల ఆధ్వర్యంలో అర్చకులు పెళ్లూరు సునీల్ మంత్రోచ్చరణల మధ్య మహాలక్ష్మి సహస్రనామ పారాయణం చేశారు. శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని శ్రీ వైష్ణవి దుర్గాదేవి శ్రీ మహాలక్ష్మమ్మ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో కృష్ణయ్య, కుమార్, శీనయ్య తదితరులు పాల్గొన్నారు.

## సూపర్ జిఎస్‌టిపై ప్రజలకు అవగాహన కల్పించండి

**- జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ పిలుపు**

కోట, సెప్టెంబర్ 27 ప్రభాతవార్త: కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన జిఎస్‌టి సంస్కరణలతో ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ కోరారు. శుక్రవారం ఎంపిడిఓలతో జూమ్ సమావేశాల ద్వారా మాట్లాడారు. కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిన 2.0 జిఎస్‌టి సంస్కరణల్లో భాగంగా రెండు రకాల స్లాబ్‌లు ప్రవేశపెట్టిందన్నారు. 12 నుంచి 5శాతానికి తగ్గించడం, 25 శాతం నుంచి 18 శాతం వరకు తగ్గించారని చెప్పారు. ఈ నెల 26 నుంచి అక్టోబర్ 19వ తేదీ వరకు గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు, మహిళలకు, యువతకు, మధ్యతరగతి వ్యాపారులకు, ఇతర అన్ని రంగాల వారికి అవగాహన కల్పించాలని కోరారు. ఇకపై జిఎస్‌టిలో 5 శాతం, 18 శాతం శ్లాబులు మాత్రమే ఉంటాయని చెప్పారు. జూమ్ సమావేశంలో ఎంపిడిఓ దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.

## నిమ్మ తోటల్లో చిరు ధాన్యాలు సాగు చేసుకోవాలి



వెంకటగిరి, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త: నిమ్మ తోటల్లో రైతులు చిరుధాన్యాల పంటలు సాగు చేసుకోవాలని పరిశోధన కేంద్రం డాక్టర్ పి శ్యాంసుందర్ రెడ్డి తెలిపారు. భారతీయ చిరుధాన్యాల పరిశోధనా సంస్థ హైదరాబాదు, డాక్టర్ వైయస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం వారి ఆర్థిక సహాయంతో నిమ్మ, చీని పరిశోధన కేంద్రంలో నిమ్మ తోటల్లో అంతర్ పంట సాగుపై ఎంపిక చేసిన 25 మంది రైతులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిమ్మ తోటల్లో అంతర్పంట చిరుధాన్యాల పంటల సాగు చేస్తే మంచి లాభాలు పొందొచ్చని తెలిపారు. రైతులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త ఈ కందార్ నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

## వేయింగ్ మిషన్లకు స్టాంపింగ్ వేయించుకోవాలి



బాలాయపల్లి, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త: రేషన్ షాప్ డీలర్లు తప్పనిసరిగా వేయింగ్ మిషన్లకు స్టాంపింగ్ వేయించుకోవాలని లీగల్ మెట్రాలజీ ఇన్స్పెక్టర్ ప్రసాద్ తెలిపారు. మండల కేంద్రమైన బాలాయపల్లి తహసిల్దార్ కార్యాలయంలో రేషన్ షాపు డీలర్ల వేయింగ్ మిషన్లకు 2025-26 సంవత్సరానికి లీగల్ మెట్రాలజీ ఇన్స్పెక్టర్ ప్రసాద్, తూనికలు కొలతల సిబ్బంది కరుణకర్ స్టాంపింగు సిల్ వేశారు. ఇంకా సీల్ వేయించుకొని వారు సీలింగ్ వేయించుకోవాలని, లేకుంటే అపరాధ రుసుము తప్పదని హెచ్చరించారు. మండంలో 38 షాపులు ఉన్నట్లు ఇన్స్పెక్టర్ ప్రసాద్ తెలిపారు. షాపులకు యజమానులకు సులభతరంగా ఉండేందుకు ప్రతి మండల కేంద్రం తహసిల్దార్ కార్యాలయంలోనే క్యాంపులు ఏర్పాటు చేసి సీల్ స్టాంపులు వేస్తున్నట్లు ఆయన వివరించారు.ప్రతి డీలర్ రేషన్ షాపు ఐడి, బ్యాంకు ఖాతా, ఆధార్ కార్డు, తదితర ధ్రువపత్రాలు అందజేయాల న్నారు. కమిషన్ త్వరలోనే బ్యాంకు ఖాతాలకు జమ అవుతుందని డిప్యూటీ తహసిల్దార్ సందీప్‌కుమార్ వారికి తెలిపారు.

## పట్టాలు కలిగిన రైతుల పేర్లు తొలగించారు

**-అసెంబ్లీలో ఎమ్మెల్యే రామకృష్ణ**



వెంకటగిరి, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త: వెంకటగిరి నియోజకవర్గంలోని కలువాయి మండలంలో ఉన్న మాదన్నగారిపల్లి, రామన్నగారిపల్లి గ్రామాల్లో 200 మంది రైతులు 400ఎకరాల్లో నిమ్మ తదితర పంటలు సాగు చేసుకుంటుండగా గత ప్రభుత్వం రీ సర్వే పేరుతో రికార్డులలో రైతుల పేర్లు తొలగించాలని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అసెంబ్లీలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. రికార్డులలో రైతుల పేర్లు తొలగించడం వల్ల రైతులు ప్రభుత్వ నుండి పొందే పథకాలను తీసుకోలేకపోతున్నట్లు చెప్పారు. గత వైసిపి ప్రభుత్వం రైతులను తీవ్ర ఇబ్బంది పెట్టిందని తెలిపారు. ఎన్నో సంవత్సరాల నుండి రైతులు పొలాల్లో సాగు చేసుకుంటుంటే వారి పేర్లు రికార్డులలో తొలగించడం దారుణమని చెప్పారు. రైతులకు వెంటనే న్యాయం చేయాలని కోరారు.

## జీఎస్టీ తగ్గింపుతో ప్రజలకు మేలు



గూడూరు, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త : కూటమి ప్రభుత్వం పేద,మధ్య తరగతి వర్గాలకు సూపర్ గిఫ్ట్, సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ కార్యక్రమాలను అమలు చేసిందని టిడిపి నాయకులు బిల్లు చెంచురామయ్య తెలిపారు. గూడూరు పట్టణంలోని వ్యాపారులను టిడిపి నాయకులు కలిసి జీఎస్టీ తదితర వాటిపై కరపత్రాలు అందజేసి అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పులిమి శ్రీనివాసులు, కొండూరు వెంకటేశ్వర్లు రాజు, వాటంబేటి శివకుమార్, నిమ్మకాయల నరసింహులు, దువ్వూరు రవీంద్రారెడ్డి, ఏసుపాక పెంచలయ్య, శ్రీపాదం ఉదయ్, నరసరాజు, యువత నాయకులు వేముల సునీల్, దయాకర్, సాయి క్రిష్ణ, జనసేన నాయకులు మోహన్, స్థాయి కిరణ్, లతీఫ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## నేదురుమల్లితో స్థానిక నేతలు భేటీ



వాకాడు, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త: వాకాడులో నేదురుమల్లి నివాసంలో రాష్ట్ర కమ్యూనిటీ డెవలప్మెంట్ మాజీ చైర్మన్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డితో శుక్రవారం స్థానిక వైకాపా నేతల భేటీ అయ్యారు. మండలంలోని పలు సమస్యలపై ఆయన దృష్టికి తీసుకొచ్చారు, రాజకీయ పలు అంశాలపై నేదురు మల్లితో స్థానిక నేతలు చర్చించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యులు రామకృష్ణ, మండల పార్టీ అధ్యక్షులు సుధాకర్ నాయుడు, జిల్లా అధికార ప్రతినిధి కొడవలూరు దామోదర్‌రెడ్డి, సర్పంచ్ సిద్ధారెడ్డి మధుసూదన్ రెడ్డి, ఉప సర్పంచ్ పాపారెడ్డి,రాజశేఖర్‌రెడ్డి, నాయకులు నాగూర్‌రెడ్డి, రవి శేఖర్‌రెడ్డి, గూడూరు సుధాకర్‌రెడ్డి, వాకాటి రవి కుమార్, గూడూరు వెంకటేశ్వర్‌రెడ్డి, స్థానిక నేతలు తదితరులు ఉన్నారు.

## యువకుడుని కాపాడిన అగ్నిమాపక శాఖ

వాకాడు, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త: స్వర్ణముఖి నదిలోకి వాకాడు దళితవాడ కు చెందిన చిన్ని కృష్ణ అలియాస్ పుష్ప మద్యం మత్తులో నదిలోని, గోడమీద అంచుల్లో ఉండడంతో గమనించిన స్వర్ణముఖి బ్యారేజీ సిబ్బంది వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందిన వెంటనే హెడ్ కానిస్టేబుల్ బాబి జాన్ ప్రత్యేక చొరవ తీసుకొని గజ ఈతగాలను నదిలోకి పంపడంతో పాటు, అగ్నిమాపక సిబ్బంది వారికి సమాచారం అందించడంతో వారు హుటాహుటిన వచ్చి ఆ వ్యక్తిని సురక్షితంగా కాపాడారు. గతంలోనూ ఈ వ్యక్తి సెల్ ఫోన్ టవర్ ఎక్కి ఆందోళనకు గురి చేసిన సంగతి తెలిసిందే.

## గేట్ కళాశాలలో ప్రాంగణ ఎంపికలు



తిరుపతి విద్య, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త: స్థానిక భవాని నగర్ కూడలి నందు గల గేట్ డిగ్రీ కళాశాలలో సెప్టెంబర్ 25 న బెంగళూరుకి చెందిన ప్రముఖ మల్టీ నేషనల్ కంపెనీ గ్లోలాజిక్స్ వారు ప్రాంగణ ఎంపికలు నిర్వహించగా ఇందులో 74 మంది గేట్ విద్యార్థిని, విద్యార్థులు ఉద్యోగాలకు అర్హత సాధించారని తెలిపారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థిని,విద్యార్థులకు కళాశాల చైర్మన్ తమ్మినేని వెంకటేశ్వర్లు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎం రమేష్,ప్లేస్ మెంట్ అధికారి ఎం రఫీ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆకట్టుకుంటున్న అలంకారాలు... మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు



శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 26 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో దసరా మహోత్సవాలు అంగరంగ వైభవంగా కన్నుల పండువగా నిర్వహిస్తున్నారు.ఈ నేపధ్యంలో వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయాల్లో అకట్టుకునేటట్టు లైటింగ్ అలంకరణలు చేపట్టారు. అమ్మవార్ల అలంకారాల్లో ఒకదానికి మించి మరొక అమ్మవార్ల విగ్రహాలకు అలంకరిస్తూ ఆకట్టుకుంటున్నారు. ఈ నేపధ్యంలో శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న ఆలయాల్లో అమ్మవార్లకు ప్రత్యేకంగా అలంకారాలు చేపట్టారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన జ్ఞాన ప్రసూనాంబ అమ్మవారు, కనకాచలంపై వెలసిన దుర్గమ్మ ఆలయంలో వెలసిన అమ్మవారికి 'స్కందమాత అలంకారాన్ని' నిర్వహించారు. ముత్యాలమ్మ అమ్మవారికి మహాలక్ష్మీ దేవి అలంకారం జరిపారు. కరెన్సి నోట్లతో అమ్మవారికి హారాలు గా అలంకరించారు. ఏడు గంగమ్మల ఆలయంలో వెలసిన అమ్మవారికి స్కందమాత ఆలంకారం జరిపారు. వేదాం గ్రామంలో దక్షిణ కాళిమాత అమ్మవారికి మహాలక్ష్మీ అలంకారం జరిపారు. భాస్కర్‌పేటలోని చాముంటేశ్వరి ఆలయంలో అమ్మవారికి మహాలక్ష్మీ అలంకారం,బజారువీధిలోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో వెలసిన అమ్మవారికి గాయత్రిదేవి అలంకారం పానగల్ పొన్నాలమ్మ అమ్మవారి శ్రీమహాలక్ష్మీ అలంకారం,బిపి అగ్రహారంలోని పెద్ద గంగమ్మకు మహాలక్ష్మీ అలంకారం జరిపారు.బహదూరు పేటలోని నల్లగంగమ్మకు శ్రీ మహాలక్ష్మీ అలంకారం జరిపారు.బహదూరుపేటలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారికి శ్రీరంగం రంగనాయక అలంకారాలు జరిపారు.

## 4.60 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

పుత్తూరు(నగరి), సెప్టెంబరు 26 ప్రభాతవార్త : నగరి పట్టణంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని శుక్రవారం సాయంత్రం పోలీసులు పట్టుకున్నారు. ఏకాంబరకుప్పం ప్రాంతంలో ఆటోలో తరలిస్తున్న 4.60 క్వింటాళ్ల బియ్యం బస్తాలను పట్టుకుని, పంచనామా అనంతరం స్థానిక పౌరసరఫరాల శాఖ గోదాముకు తరలించారు. ఈ బియ్యం ఏకాంబరకుప్పంలో నివశించే చిన్నయ్య అనే వ్యక్తికి సంబంధించినదని పోలీసులు అనుమానిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఆరు నెలలుగా వీధి దీపాలు వెలగడం లేదు



పాకాల, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త: స్థానిక పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న బందుల దొడ్డి వీధిలో గత కొంత కాలంగా వీధి దీపాలు విద్యుత్ స్తంభం నుంచి కిందికి జారిపోయిన కనీసం తిరిగి బిగించకుండా పంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని క్లినిక్,మెడికల్ షాపులు డాక్టర్లు ఉన్న వీధిలో ఎక్కువ రోగులు హాస్పిటల్ కొరకు తిరిగే కూడలిలో కూడా వీధి దీపాలు వెలగక పోవడం బాధాకరమని స్థానికులు పంచాయతీ తీరుపై తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. పాకాల పంచాయతీ సిబ్బంది మెయిన్ రోడ్డుపై రైల్వే ప్రహరీ గోడ అనుకోని ఫుట్పాత్ మొత్తం అడుగు లెక్కన ప్రైవేటు వారికి దాన ధర్మం చేసి రోజువారి గేటు వసులు పనిలో తీవ్రంగా తల మునకలై ఉన్నారని వీధి దీపాలు పారిశుధ్యం సిసి రోడ్డుల పై ఏర్పడ్డ గోతులు పుడ్చటం తీవ్రంగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు అరోపోస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధి కారులు పాకాల పంచాయతీ సిబ్బందిపై తీరు పై చర్యలు తీసుకొని నగరంలో పుట్టగొడుగుల్లా ఏడ పెడ వెలస్తూ వున్న ఫుట్పాత్ పైన ఏర్పాటు చేసిన షాపులను వెంటనే తొలగించి వాహనదారులకు ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా చూడవలసినదిగా మరియు వెలగని వీధి దీపాల వెంటనే మరమ్మత్తులు పూర్తి చేయవల్సిందిగా ఆదేశాలు జారీ చేయాలి అని ప్రజలు కోరుతున్నారు.

## దేవదేవునికి కనువిందుగా సాంస్కృతిక వైభవం



**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:**

కలియుగవైకుంతం తిరుమలలో ఏడుకొండలస్వామికి జరుగుతున్న సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో వివిధ కళారూపాయలు, కళాకారుల సాంస్కృతిక వైభవం కనువిందుచేస్తున్నాయి. వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన కళాకారులు ,సంప్రదాయ జానపదనృత్యాలు, కళారూపాలకు అద్భుత వేదికగా నిలిచింది. వాహనం ముందు గుస్సడీ నృత్యం, లవణి,భరతనాట్యం, నవదుర్గ,కూచిపూడినృత్యం, శ్రీవేంకటేశ్వర మహత్యం కళాప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి. మూడవరోజు ఉదయం 9రాష్ట్రాలకు చెందిన 20 కళాబృందాలు తమ వైభవాన్ని మరింతగా చాటారు.

**అమ్మవారిని సేవలో...**

## మాజీ సుప్రీం కోర్టు న్యాయమూర్తి ఎన్‌వి రమణ



తిరుచానూరు, సెప్టెంబర్ 26, ప్రభాతవార్త తిరుచానూరు పద్మావతి అమ్మ వారిని మాజీ సుప్రీం కోర్ట్ న్యాయమూర్తి ఎన్.వి రమణ తన సతీమణితో కలసి దర్శించుకున్నారు. వీరిని ఆలయ అర్చకులు ఘనంగా స్వాగతించి దర్శన భాగ్యాన్ని కల్పించారు. అనంతరం ధ్వజస్తం నమస్కరించి అమ్మవారిని దర్శించు కున్నారు. తరువాత ఆశీర్వాదం మండపం వద్ద డిప్యూటీ ఈఓ హరేంద్రనాథ్ తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ దేవరాజులు, సుపరిండెంట్ రమేష్ పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

## మహిళల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం



కోట,సెప్టెంబర్ 26 ప్రభాతవార్త: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యకరమైన బిడ్డకు జన్మనివ్వడమే కాకుండా ఆనందర కమైరన సమాజాన్ని నిర్మించవచ్చని చిట్టేడు ఆరోగ్య ఉప కేంద్రం డాక్టర్ నాగరాజు చెప్పారు. శుక్రవారం మండల పరిధిలోని చెందోడులో స్వస్థనారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంగా ఉంటే కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందన్న సంకల్పంతో ప్రధాని మంత్రి స్వస్థనారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ప్రారంభించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్, సురేష్, పంచాయతీ కార్యదర్శి కిరణ్ కుమార్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ కవిత, తెదేపా నాయకులు వాకా విజయభాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అన్నపూర్ణ దేవి అలంకరణలో శ్రీ మూలస్థాన ఎల్లమ్మ

**నంది వాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనం**



చంద్రగిరి, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త: అన్నపూర్ణ దేవి అలంకరణలో శ్రీ మూలస్థాన ఎల్లమ్మ నంది వాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. చంద్రగిరిలో అమ్మవారి దేవీ నవరాత్రి మహోత్సవాలను దేవాదాయ ధర్మాధాయశాఖ ఆధ్వర్యంలో ఆలయ చైర్మన్ మొక్కల చంద్రశేఖర్‌రెడ్డి పాలక మండలి, ఈఓ మమత పర్యవేక్షణలో వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆలయ అర్చకులు శుక్రవారం అమ్మవారికి వేకువజామున అభిషేకం జరిపించారు. ఆలయ అర్చకులు సూరిస్వామి అమ్మవారిని వివిధరకాల సుగంధ భరిత పుష్పాలు, బంగారు ఆభరణాలతో విశేష అలంకరణ గావించి నంది వాహనంపై అధిష్టింపజేశారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలు నడుమ ఓంశక్తి భక్తుల భజనలతో అమ్మవారి నంది వాహనసేవ కన్నుల పండువగా సాగింది. ఈ వాహనసేవకు చంద్రగిరికి చెందిన బురిగాల వంశస్థులు, నడింపల్లి గ్రామస్థులు, మొండికాల్వకు చెందిన వి.నాగరాజ నాయుడు దాతలుగా వ్యవహరించారు. దాతలకు ఆలయ చైర్మన్, ఈఓ అమ్మవారి దర్శన ఏర్పాట్లు గావించి, తీర్థప్రసాదాలను అందజేశారు.

## దుష్టశిక్షకుడు...భక్తరక్షకుడు...యోగనరసింహుడిగా అభయం



తిరుమల, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త ప్రతినిధి: కలియుగంలో దుష్టశిక్షణ, శిష్టరక్షణ కోసం సింహవాహనంపై కూర్చుని మలయప్పస్వామి యోగ నరసింహుడి అలంకారంలో ఊరేగారు. సింహం పరాక్రమానికి, ధైర్యానికి, తేజస్సుకు, ఆధిపత్యానికి ,మహాద్వనికి సంకేతం. సింహరూప దర్శనంతో అనేక శక్తులు చైతన్యవంతులవుతాయి. అజ్ఞానంతో ప్రవర్తించే దుష్టులను హరించడంలో నేనునా వాహనమైన సింహము సమాన ప్రయత్నంలో వుంటామని ఈ సింహవాహనోత్సవం ద్వారా ఏడుకొండల స్వామి తెలియజేశారు. బ్రహ్మోత్సవాల్లో శుక్రవారం ఉదయం మలయప్పస్వామి యోగ నరసింహస్వామి అలంకారంలో అనంతతేజోమూర్తిగా భక్తులకు అభయమిచ్చాడు. ఆలయ మాఢవీధుల్లో భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి గోవింద నామస్మరణలతో పునీతులయ్యారు. ఈ వాహనసేవలో పెద్దజీయర్‌స్వామి,చిన్నజీయర్‌స్వామి, సుప్రీంకోర్టు మాజీ సిజెఐ జస్టిస్ ఎన్‌వి రమణ, బోర్డు సభ్యులు భానుప్రకాశ్‌రెడ్డి,దివాకర్‌రెడ్డి, నరేశ్, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, టిటిడి ఈఓ అనిల్‌కుమార్‌సింఘాల్ దంపతులు,ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం, ఆలయ పేష్కార్ రామకృష్ణ, అర్చకులు,వేదపండితులు పాల్గొన్నారు.

## భక్తుల్లో భక్తుడిగా ఈఓ సింఘాల్

**మాఢవీధుల్లో తిరుగుతూ సౌకర్యాలపై ఆరా**



తిరుమల, సెప్టెంబర్ 26ప్రభాతవార్తప్రతినిధి: ఆలయ మాఢవీదుల్లో స్వామివారివాహన సేవలు ఊరేగుతున్న సమయంలో తన హోదాను మరచి భక్తుల్లో భక్తుడిగా టిటిడి ఈఓ అనిల్‌కుమార్ సింఘాల్ భక్తులను పలకరిస్తున్నాడు. ఆప్యాయంగా మాట్లాడి భక్తుల నుండి సౌకర్యాల కల్పనపై, సదుపాయాలతోబాటు ఆలయంలో స్వామివారి దర్శనం, లడ్డూనాణ్యత, అన్నప్రసాదాల రుచి గురించి అడిగి తెలుసుకుంటున్నారు .గ్యాలరీల్లో అందుతున్న సేవలపై భక్తులు సంతృప్తి వ్యక్తం చేయడంతో వారితో కరచాలనం చేసి మరీ సామాన్యుడిగా ఈఓ ముందుకు కదులుతున్నారు. శుక్రవారం ఉదయం సింహవాహనసేవ వీక్షణకు గ్యాలరీల్లోని భక్తులతో ఈఓ మాట్లాడి వారి నుండి అభిప్రాయాలు తెలుసుకున్నారు.

## మ్యాజిక్ డ్రైన్లతో గ్రామాలలో పారిశుధ్యం

**-గ్రామీణ అభివృద్ధిశాఖ అధనపు కమీషన్ శివప్రసాద్**



రామచంద్రాపురం, సెప్టెంబర్ 26 ప్రభాతవార్త: మ్యాజిక్ డ్రైన్లతో గ్రామాలలో పారిశుధ్యం మెరుగుపరుచుకోవచ్చని గ్రామీణాభి వృద్ధిశాఖ అధనపు కమీషనర్ శివప్రసాద్ అన్నారు. శుక్రవారం కుప్పంబాదూరు పంచాయతీలోని వడ్డికాల్వ ఏఎడబ్ల్యులో మ్యాజిక్ డ్రైన్‌పై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి నుండి వెలువడే మురుగునీరు రోడ్డుపై చేరకుండా మ్యాజిక్ డ్రైన్‌లలో విడిచిపెట్టడం ద్వారా భూగర్భ జలాలలను పెంపొందించు కోవచ్చన్నారు. గ్రామాలలో దోమలను నివారించి ప్రజలు ఆరోగ్యవంతమైన జీవనాన్ని గడిపేందుకు అవకాశం కల్పించాలన్నారు.తక్కువ ఖర్చుతోనే మ్యాజిక్ డ్రైన్లను నిర్మించుకోవచ్చాన్నారు. ఈ కార్యక్రమంలో పిడి శ్రీనివాస ప్రసాద్, ఏపిడిలు రెడ్డెప్ప, డాక్టర్ బి.సుబ్రమణ్యం, సునీల్‌కుమార్, ఎంపిడిఓ శ్రీనివాసులు, ఏపిఓ సుజాత, మాజీ సర్పంచ్ ధనంజయులు, తిరుపతి, నెల్లూరు, కడప, అన్నమయ్య జిల్లాలకు చెందిన క్షేత్ర సహాయకులు, సాంకేతిక సహాయకులు, జూనియర్ ఇంజినీర్లు, తదితరులు పాల్గొన్నారు.

## మీ సంతోషమే మాకు బలం



బ్రహ్మోత్సవాల్లో భక్తులకు అందుతున్న సౌకర్యాలపై స్వయంగా వారితో మాట్లాడి తెలుసుకున్న టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, ఈఓ సింఘాల్. శుక్రవారం రాత్రి 9వ నంబర్ గ్యాలరీల్లోని భక్తులు సంతోషం వ్యక్తం చేయడంతో మరింత రెట్టింపు సేవలందిస్తామని తెలిపారు. ప్రభాతవార్త-తిరుమల

## శీతలాంబ సన్నిధిలో విశేష పూజలు



శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 26 ప్రభాతవార్త: శ్రీకాళహస్తిలోని బహుదూరుపేట, శీతలాంబ అలయంలో శుక్రవారం అమ్మ వారికి విశేష అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఉభయదారులు పడోలకర్ మహేశ్వరరావు కుటుంబ సభ్యులతో అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపించారు. ఈ సందర్భంగా అమ్మవారి అభిషేక సేవల్లో వారు పాల్గొన్నారు. అమ్మవారికి ప్రత్యేక అలంకారాలతో భక్తులకు కనువిందు చేసింది.